లూకా కొన్ని ప్రదేశములు, పట్టణములు, సంఘటనలను గూర్చి తన గ్రంథాలలో వ్రాసాడు. గాని క్రొత్త నిబంధనలో తప్ప వేరే ఎక్కడా వాటిని గూర్చి చెప్పబడ లేనందున లూకా వ్రాసినది నమ్మవచ్చునో లేదోయని చరిత్రకారులు తలంచారు గాని ఈ మధ్య పురాశిల్ప శాస్త్రజ్ఞులు కనుగొన్న వాస్తవములు లూకా వ్రాసిన సంగతులు యదార్థములని నిరూపిం చుచు, అతనిని విమర్శించిన వారి నోళ్లు మూయించాయి.

**యేసు జన్మ సందర్భ సంఘటనలు :**

యేసు జనన సందర్భముగా సంభవించిన సంగతులను గూర్చి లూకా తప్పుగా వ్రాసాడని చరిత్రకారులు తలంచారు (లూకా 2:1-3). ఆ కాల మందు ప్రజా సంఖ్య యేమీ వ్రాయబడ లేదు. ప్రజలు తమ తమ స్వగ్రామములకు వెళ్లనవుసరం లేదని, కురేనియ సిరియకు అధిపతి కాదని వారు వాదించారు.

గాని, ప్రతి 14 సంవత్సరముల కొకసారి పన్ను చెల్లించే ప్రతివారు తమ స్వస్థలములకు వెళ్లవలెనని పురావస్తు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. క్రీ॥పూ॥ 8వ సంవత్సరములో అట్టి జనసంఖ్య ఒకటి వ్రాయబడెను. లూకా బహుశ దీనిని గూర్చియే వ్రాసాడు.

క్రీ॥పూర్వము 7వ సంవత్సరం కాలములో సిరియాకు కురేనియ అధిపతిగా యుండెననే శిలాఫలకము నొక దానిని అంతియొకయలో శాస్త్రజ్ఞులు

కనుగొన్నారు. సిరియాకు అధిపతిగా కురేనియ రెండు మారులు క్రీ॥పూ॥7 లోను, క్రీ॥శ॥ 6లోను పనిచేసెనని ఇప్పుడు శాస్త్రజ్ఞులు కనుగొన్నారు.

ఐగుప్తు దేశములో ఒక కాగితపు చుట్టను కనుగొన్నారు. రాబోవుచున్న ప్రజాసంఖ్యను గూర్చిన హెచ్చరికలు అందులో వ్రాయబడియున్నాయి. అది యిట్లు చెప్పింది. "రాబోవుచున్న ప్రజా సంఖ్యను బట్టి ఎవడైనను, ఏదైనా కారణము వలన తన స్వదేశమునకు వెంటనే వెళ్లుటకు సిద్ధపడవలెను. అవ్విధముగా వారు తమ కుటుంబము లను రికార్డులోనికి చేర్పించ గలరు. అప్పుడు రికార్డు సంపూర్తి యగును". ఈ రీతిగా లూకా వ్రాసినది కరక్టేయని పురావస్తు శాస్త్రజ్ఞులు నిరూపించిరి.

### లూసానియ (Lysanias) :

లూకా 3:1లో అబిలేనే దేశమునకు లూసానియ అధిపతిగా యుండెనని, తిబెరికైసరు యొక్క ఏలుబడిలో 15వ సంవత్సరం ముందుండెనని లూకా వ్రాసాడు. అంటే అది క్రీ॥శ॥27వ సంవత్సరము. దీనిని విద్యావేత్తలు హేళన చేసారు. వారెరిగిన ఒకే ఒక్క లూసానియా అనువాడు క్రీ॥పూ॥36లో చంపబడెను.

గాని శాస్త్రజ్ఞులు దమస్కు పట్టణంలో ఒక శిలాఫలకమును కనుగొనగా అందు లూసానియ అనునతడు క్రీ॥శ॥14 నుండి 29వరకు అబిలేనే దేశమునకు అధిపతిగా యుండెనని వ్రాయబడియున్నది! ఇందు మూలముగా లూకాయే కరెక్టని మరొక మారు రుజువాయెను.

### జనుల సభ (Polytarch) :

అపొ.కా. 17:5లో లూకా జనుల సభ అనే పదాన్ని ఉపయోగించాడు. ఇదొక గ్రీకు పదము గాని ఆ పదాన్ని సాంస్కృతిక గ్రీకు భాషలో వ్రాడేవారు కాదు. గనుక లూకా 'జనుల సభ' అనే పదాన్ని వాడి తప్పు చేసాడని అనేకులు తలంచారు. గాని థెస్సలోనిక పట్టణంలో మొదటి శతాబ్దములో నిర్మించబడిన ధనురాకార శిలా వంకరమును (arch) ఒక దానిని కనుగొనగా దానిపై "జనుల సభ" కాలంలో అని వ్రాయబడియున్నది! ఈ మధ్య కాలంలో శాస్త్రజ్ఞులు "జనుల సభ" లను గూర్చి చెప్పు పురాతన శిలా ఫలకములను ముప్పయి అయిదింటిని కనుగొన్నారు. అందులో ఐదు పౌలు కాలములో థెస్సలోనికయంలో వ్రాయబడినవే!

### ఈకొనియ (Iconium) :

అపొ.కా. 14:6లో లుస్త్ర, దెర్బే అను పట్టణములు లుకయొనియలో యున్నట్లు లూకా వ్రాసాడు. ఈకొనియ మాత్రం కాదన్నట్లును వ్రాసాడు. లూకా తప్పు అని ఈకొనియ లుకయొనియలో భాగమేనని చరిత్రకారులు చెప్పేవారు. రోమన్ గ్రంథకర్తలగు సిసెరో, స్ట్రేబో, ప్లినీ మొ॥గు

వారి వ్రాతలపై ఆధారపడి అపొస్తలుల కార్యముల గ్రంథము వాస్తవం కాదని వారన్నారు.

అయితే 1910 సం॥లో సర్ విలియం రామ్సే అనునతడు ఈకొనియ లుకయొనియలో గాక ఫ్రుగియలోని పట్టణమని కనుగొన్నాడు. ఈకొనియలో దొరికిన రెండు శిలాఫలకములను బట్టి పౌలు దర్శించిన తరువాత ఇంచుమించు రెండువందల సంవత్సరములు మట్టుకు ఫ్రుగియ భాష అక్కడ వాడుకలో యున్నట్లు రుజువాయెను. మరల, లూకాయే రైటాయెను. అతని విమర్శకులు దోషులైరి.

సర్ విలియం రామ్సే ఈ భూమి మీద నివసించిన పురాతన వస్తు శాస్త్రజ్ఞులలో ఘనుడు. లూకా చెప్పిన 35 దేశములు, 54 పట్టణములు, 9 ద్వీపములను పరిశోధించి లూకా ఏ ఒక్క దానిని గూర్చి కూడ తప్పు చేయలేదని కనుగొన్నాడు.

చరిత్రాత్మక ప్రదేశములను సంఘటనలను గూర్చి చెప్పునప్పుడు లూకా అంతజాగ్రత్తగా యుంటే, అంత కన్నా ప్రాముఖ్య సంగతులగు యేసుక్రీస్తు యొక్క అద్భుతములు, బోధలు, మరణం, సమాధి, పునరుత్థానములను గూర్చి మరింత ఎక్కువ జాగ్రత్త వహించి యుండెననుట సమంజసమే.

## గబ్బతా – రాతి మంటపము :

యేసును విమర్శించి పిలాతు ఆయనకు మరణశిక్ష విధించిన గబ్బతా అను రాతిమంటపము యొక్క రికార్డు యేమీ లేదని కొందరు శంకించారు (యోహాను 19:13). గబ్బతా ఒక కల్పిత స్థలమని, యోహాను సువార్త చారిత్రాత్మకము కాదని సందేహశీలురు తలంచారు.

అయితే పురావస్తు శాస్త్రజ్ఞులు గబ్బతా అను స్థలము యెరూషలేములో రోమన్ మిలటరీ కేంద్రమైన ఆంటోనియా స్థూపములో భాగమైయుండెనని ఈ మధ్య కనుగొన్నారు. క్రీ॥శ॥66–70లో యెరూషలేము ముట్టడి వేయబడి శిథిలమైనప్పుడా స్థలము కూలగొట్టబడి పాతిపెట్టబడెను. హాద్రియన్ పాలనలో యెరూషలేము తిరిగి కట్టబడినప్పుడు కూడా ఆ స్థలము భూస్థాపితమై యుండెను. ఈ మధ్య కాలములో అది కనుగొనబడే వరకు అట్లే యుండెను. పిలాతుచే యేసుకు తీర్పు తీర్చబడిన ఆ రాళ్ళ మంటప స్థలమును ఈనాడు నీవు కూడా వెళ్లి చూడవచ్చును.

## యోహాను సువార్త :

చరిత్రకారులు ఎరుగని స్థలములను గూర్చి యోహాను తన సువార్తలో వ్రాయుటచే సందేహశీలురు యోహాను సువార్త నమ్మదగినది కాదని యనుకొనేవారు. గ్రంథకర్త ఆయా వివరాలను సరిగా లిఖించలేదు గనుక అతడు రెండవ శతాబ్దములో జీవించియుండవచ్చును. ఆ సువార్తలో చెప్పబడిన సంఘటనలకు,

ప్రదేశములకు అతడు సుదూరములో యున్న వ్యక్తియై యుండవచ్చని వారన్నారు.

## బేతెస్థ కోనేరు :

ఉదాహరణకు బెతేస్థ కోనేటి దగ్గర 35 ఏండ్ల నుండి వ్యాధిగ్రస్తుడైన వానిని యేసు బాగుచేసినట్లు యోహాను వ్రాసాడు (యోహాను 5:1-15). ఆ కోనేరులకు అయిదు మంటపములున్నట్లు యోహాను వ్రాసాడు. యోహాను యొక్క పొరబాట్లకు ఒదొక ఉదాహరణ. అట్టి ప్రదేశమును గూర్చి ఎవరు ఏనాడు వినలేదని సందేహశీలురు అన్నారు.

అయితే ఈ మధ్యకాలములో యెరూషలేముకు ఈశాన్యదిశలో పురావస్తు శాస్త్రజ్ఞులు బేతెస్థ కోనేటిని తవ్వి దానిని కనుగొన్నారు. నేల మట్టమునకు 40 అడుగులు దిగువలో దాని నీరుండేది. ఆ కోనేరు చుట్టూ యోహాను చెప్పినట్లే 5 మంటపములు, ద్వారములున్నాయి.

## కయఫ సమాధి స్థలము :

యేసు ప్రభువుకు తీర్పు చెప్పి, శిక్ష విధించి, సిలువ వేసిన సమయంలో కయఫ అనునతడు యూదుల ప్రధాన యాజకుడుగా యుండెనని క్రొత్త నిబంధన చెప్పుచున్నది (మత్తయి 26:3, 57; యోహాను 11:49; 18:14,28). అయితే రోమీయులు క్రీ॥శ॥ 70లో దేవాలయపు రికార్డులన్నిటినీ నాశనం చేసేసారు. కయఫ అనునతడు ఎప్పుడైనా జీవించాడో లేదో యూదుల చరిత్ర కనుగొనలేకపోయింది.

1990లో యెరూషలేములో జలవినోద స్థలమును (Water Park) నిర్మించుచున్న సమయంలో కొందరు పనివారు అనుకొనని రీతిగా పురాతన సమాధుల గుహను ఒకదానిని కనుగొన్నారు. ఆ గుహలో 60 సం॥ల వయసు గల ఒక పురుషుని అస్థికలుండెను. అవి ప్రధాన యాజకుడైన కయఫకు చెందినవని తలంచబడెను. పగుళ్లు తీసిన ఒక పెద్ద రాతిపెట్టెమీద, యోహెూసెఫ్ బర్ కయఫస్ (Yehosef bar Kayafas) (Joseph Son of Caiphas) అని చెక్కబడి యుండెను. అనగా కయఫ కుమారుడైన యోసేపు అని అర్థము. ఆ గుహలో కనుగొనబడిన ఇత్తడి నాణెములు క్రీ॥శ॥ 42-43లో హేరోదు అగ్రిప్ప-1 కాలములో తయారు చేయబడెను.

క్రీ॥శ॥ 18 నుండి 26 వరకు కయఫ అనబడిన యోసేపు యెరూషలేములో ప్రధాన యాజకుడుగా యుండెనని జోసిఫస్ అను యూదుల చరిత్రకారుడు వ్రాసాడు. యోసేపు అనునది కయఫ యొక్క అసలు పేరు.

## పురావస్తు శాస్త్రము కనుగొన్న ఇంకా కొన్ని :

క్రొత్త నిబంధన చారిత్రాత్మకంగా యదార్థమని పురావస్తు శాస్త్రం పదే పదే

నిరూపించింది.

పురావస్తు శాస్త్రజ్ఞులకు వందనములు. ఇప్పుడు మనం యేసుక్రీస్తు జన్మస్థలమగు బేత్లెహేమును, ఆయన పెరిగిన నజరేతును, కపెర్నహూములో యున్న సమాజ మందిరమును (అక్కడ యేసు అపవిత్రాత్మ పట్టిన ఒకని బాగుచేసారు), పేతురు అత్త యింటిని, యేసు ఒక గ్రుడ్డివానిని బాగుచేసిన సిలోయము కోనేటిని, గెత్సెమనే తోటను (అక్కడ యేసు తాను అప్పగింపబడిన రాత్రంతా ప్రార్థించారు), యేసు యెరూషలేములో విజయోత్సవముతో ప్రవేశించిన బంగారు సింహద్వారమును, ప్రత్యక్షముగా చూడవచ్చును. పిలాతు యేసుకు శిక్ష విధించిన గబ్బతా స్థలమును, క్రీస్తు సిలువ మోయుచు కల్వరి వరకు వెళ్లిన మార్గమును, తాను ఎమ్మాయు మార్గమున ఇద్దరు శిష్యులకు కనబడిన మార్గమును ఇప్పుడు కూడ సందర్శించ వచ్చును.

**ముగింపు :**

క్రొత్త నిబంధన చారిత్రకంగా వాస్తవమనే రుజువులు యొక్క నిర్ధారణ సాంపిల్‌ను మాత్రమే. పురావస్తు శాస్త్రము ద్వారా ఈ పాఠంలో కొంతవరకు మనం చూచాము. ప్రముఖ యూదుల పురావస్తు శాస్త్రియగు నెల్సన్ గ్లూక్ అనునతడు, “పురావస్తు శాస్త్రము కనుగొన్న దేదియు బైబిలులో చెప్పబడినది యదార్థము కాదని నిరూపించలేకపోయిందని ఖచ్చితముగా చెప్పవచ్చును'' అని యన్నాడు. ఇంకో మాటలో బైబిలుకు పురావస్తు శాస్త్రానికి మధ్య వైరుధ్యము యేమీ లేదు.

సర్ విలియం రామ్సే అను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రజ్ఞుడు, అపొస్తలులు కార్యముల గ్రంథము వాస్తవం కాదని నిరూపించడానికి అతడు ప్రయత్నం చేసాడు. అయితే అతడు కనుగొన్న వాస్తవములతని దృక్పథాన్ని మార్చి వేసాయి. లూకా వ్రాసిన వివరణలు ఆశ్చర్యకరమైన సత్యాలు అని అతడు కనుగొన్నాడు. “లూకా ప్రథమ శ్రేణి చరిత్రకారుడు. అతడు చెప్పిన సంగతులు సత్యమే గాక అతడు చారిత్రాత్మక దృక్పథం కలిగియున్నాడు. ఇంకో మాటలో ఈ గ్రంథకర్త చరిత్రకారులలో గొప్పవాడుగా ఎంచబడవలెను'' అని అతడు వ్రాసాడు.

క్రొత్త నిబంధన చారిత్రాత్మక గ్రంథము వలె ఆధారపడవచ్చునను సంగతిని పురావస్తు శాస్త్రము రూఢిపరుస్తూనే యున్నది.

**– రిచర్డ్ ఏడీ**



# సంగ్రహముగా బైబిలు చరిత్ర

## (A Walk through the Bible)

***- Paul Holland***



బైబిలు సందేశం అంతా ఒక్క మాటలో "యేసు క్రీస్తు ద్వారా దేవుని మహిమార్థమై మానవుని రక్షణ" యని చెప్పుకొనవచ్చును. బైబిలు సందేశం అంతా అదే. బైబిలు చరిత్రను మనం 15 కాలములుగా విభజింపవచ్చును. ఈ చరిత్రను మనం గ్రహించునప్పుడు బైబిలు లోని ప్రతి పుస్తకము యొక్క స్థానమును మనము గ్రహించుకొనవచ్చును.

**జల ప్రళయముకు ముందు కాలము** : బైబిలు చరిత్రలోని మొదటి కాలము ఆది కాండము మొదటి 8 అధ్యాయములలో మనకు కనబడును. సమస్తము ఎట్లు ఆరంభమాయెనో తెలియజేయు సమాచారము అందులో యున్నది. ఈ విశ్వము, భూమి, మానవుడు, కుటుంబము, పాపము, ఆరాధన మొ॥నవి ఎట్లు ఆరంభమాయెనో తెలియజేయు కాలమది. అది జల ప్రళయమునకు ముందున్న కాలము.

**జల ప్రళయమునకు తరువాత కాలము:** యిది నోవహు కాలములో




సంభవించిన జలప్రళయము తరువాత కాలము. ఆది కాండము 9 నుండి 11 వరకు యున్న అధ్యాయములు దీనిని గూర్చి తెలియజేయును.

**పితరుల కాలము :** యిది కుటుంబ యజమానియగు తండ్రులకు దేవుడు తన చిత్తమును తెలియజేసిన కాలము. దేవుడు నేరుగా కుటుంబ యజమానితో సంభాషించిన కాలము అది. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు మొదలగువారితో దేవుడు సంభాషించిన కాలము అది. ఈ పితరుల కాలము ఆది కాండము 11 నుండి 45వ అధ్యాయము వరకు యుండును. యోబు గ్రంథము కూడ దీనిలో చేర్చవచ్చును.

**ఐగుప్తీయుల కాలము :** తరువాత కాలము యాకోబు ఐగుప్తునకు వెళ్లుటతో ఆరంభ మగును. అక్కడ ఐగుప్తీయులు హెబ్రీయులను ఘోరముగా హింసించిరి. బానిసలుగా తీర్చిరి. వారు ఐగుప్తు బానిసత్వములో 400 సంవత్సరము లుండిరి. తదుపరి దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించుట జరిగెను. ఈ కాలము ఆదికాండము 46వ అధ్యాయము నుండి నిర్గమ కాండము 14వ అధ్యాయము వరకు యున్నది. ఈ కాలములోనే హెబ్రీయులు ఇశ్రాయేలీయు లనబడిరి. ఇశ్రాయేలు అను పేరు యాకోబు ఒక దూతతో పోరాడి గెలిచిన తరువాత ఆదికాండము 32లో ఇయ్యబడెను.

సీనాయి కొండ వద్ద దేవుడు వారిని ఒక జనాంగముగా చేసి వారికి మోషే ధర్మశాస్త్రము ననుగ్రహించెను. వారు అన్యజనుల వలె అనేక దేవుండ్లను గాక ఒకే ఒక్క నిజదేవుడైన యెహోవాను వెంబడించుటకు అది వారికీయబడెను. యేసు క్రీస్తు ఈ లోకములో ఉద్భవించు టకు దేవుడు ఒక జనాంగమును, వారి కొరక ధర్మశాస్త్రమును యిచ్చి కాపాడెను.

**అరణ్యయాత్ర కాలము :** ఇశ్రాయేలీ యులు నలుబది సంవత్సరముల మట్టుకు చేసిన అరణ్య ప్రయాణ కాలము అయిదవ కాలమగును. దానిని ప్రత్యేకముగా సంఖ్యా కాండము 13-14 అధ్యాయములలో కనుగొనగలము. మోషే కానాను దేశములోనికి వేగుల వారిని పంపించాడు. ఆ దేశమును వేగు చూచుటకై వారు వెళ్లారు. పంపబడిన 12 మందిలోను పది మంది ఆ దేశమును స్వాధీనపరచుకొనలేమని, అక్కడివారు

ఉన్నతదేహులని రిపోర్టు యిచ్చారు. అందువలన వారు నలుబది సంవత్సరములు అరణ్యయాత్ర చేయవలసి వచ్చినది. ఆ వేగులవారు కానానులో నలుబది దినములుండిరి. గనుక దేవుడు వారిని నలుబది సంవత్సరములు అరణ్య యాత్ర చేయించారు. ఆ అరణ్యయాత్ర కాలమును నిర్గమ కాండము, లేవీయ కాండము, సంఖ్యా కాండము, ద్వితీయోప దేశ కాండములో కనుగొనవచ్చును.

**విజయముల కాలము :** దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానము నెరవేర్చుటకుగాను, దేవుడు కానానును జయించి స్వాధీనము చేసికొనుటకు యెహోషువాను నడిపించారు. ఈ కాలమును గూర్చి యెహోషువ గ్రంథము మనకు తెలియజేయును.

**న్యాయాధిపతుల కాలము :** ఇశ్రాయేలీయులు ఆ దేశమును స్వాధీనపరచుకొను చున్నప్పుడు అక్కడ యున్న అవిశ్వాస అన్యజనాంగములను వెళ్లగొట్టలేదు. వారిని వెళ్లగొట్టవలెనని దేవుడాజ్ఞాపించి నను వారట్లు చేయలేదు. గనుక ఈ అవిశ్వాస జనాంగములు ఇశ్రాయేలీయు లకు ఆత్మీయ సమస్యలను కలుగజేసిరి.

దేవుడు వారిని ఏలుటకు న్యాయాధిపతులను ఏర్పరచెను. నేడు మనమెరిగినట్లు వారు చట్టప్రకారము సలహాలనిచ్చువారు కాదు. వారు యుద్ధ నాయకులు, కొందరు ఆత్మీయ నాయకులు, న్యాయాధిపతులు మంచిగనే ఆరంభించిరి. యెహూ, గిద్యోను, దెబారా, యెఫ్తా మొదలగువారు న్యాయాధిపతులు. అయితే యెఫ్తాతో ఆరంభించి న్యాయాధి పతులు స్వార్థపరులవుటకు మొదలిడిరి. సంసోను కూడ అట్టివాడే. తద్వారా అంతరంగిక యుద్ధములు, ఇశ్రాయేలీ యుల కుటుంబములో అంతరంగిక కలహములు మొదలిడెను. సమూయేలు న్యాయాధిపతులలో ఆఖరి వాడు. అతడు వారి మొదటి రాజును కూడా ప్రతిష్టించెను.

**ఐక్య రాజ్యము :** రాజైన సౌలు మంచిగనే ప్రారంభించెను. గాని చెడుగా అంతమా యెను. తదుపరి దావీదు రాజుగా అభిషేకించబడెను. అతడు కొన్ని పాపకృత్యములు జరిగించినను, మంచి రాజాయెను. అతని కుమారుడైన సొలొమోను సమైక్యముగా యున్న ఇశ్రాయేలు దేశమును పాలించిన ఆఖరి రాజు. రాజైన దావీదు, సొలొమోనులు క్రీ॥పూర్వము 1000 సం॥ల కాలములో పాలించిరి.

**విభాగింపబడిన రాజ్యము :** సొలొమోను కొనసాగించిన కొన్ని నిర్మాణముల కొరకు గాను ప్రజలపై పన్ను భారమును పెంచెను. సొలొమోను చనిపోయిన తరువాత అతని కుమారుడగు రెహబాము ఆ పన్నులను మరింత ఎక్కువ చేసెను. దీని వలన రాజ్యములో చీలికలేర్పడెను. ఉత్తరమున

నున్న పది గోత్రముల వారు విడిపోయి ఇశ్రాయేలు దేశమైరి.

రెండు గోత్రములు యూదా, బెన్యామీను వారు దక్షిణమున యుండి యూదా దేశముగా ఏర్పడిరి. యెరూషలేము వారి ముఖ్య పట్టణమై యుండెను. విగ్రహారాధన వలన ఉత్తర దేశమును ఏ ఒక్క రాజు కూడ మంచి వాడని పరిగణింపబడలేదు. వారు అష్షూరు రాజు వలన ఓడించబడి క్రీ॥పూ॥ 722లో బానిసలుగా కొనిపోబడిరి. ఇశ్రాయేలు దేశములోనికి ఇశ్రాయేలీయులు కాని వారిని అష్షూరీ యులు తీసికొనివచ్చి ప్రతిష్టించిరి. వారు ఇశ్రాయేలీయులతో వివాహమాడగా వారి సంతతి సమరయులని పిలువబడిరి.

ఈ చరిత్ర I రాజులు, II రాజుల గ్రంథములో లిఖింపబడియున్నది. ఆ కాలములో యెషయా, హోషేయ, యోవేలు, ఆమోసు, యోనా, మీకా అనువారు ప్రవక్తలై ప్రవచించిరి.

**యూదా కాలము :** ఉత్తర దేశములో యున్న గోత్రముల వారు బందీలుగా కొనిపోబడిన తరువాత, దక్షిణ దేశములో యున్న గోత్రముల వారు 136 సంవత్సరముల మట్టుకు నమ్మకముగా యుండిరి. తదుపరి వారు కూడ బబులోను దేశములోనికి పరదేశులుగా కొనిపోబడిరి. యిది క్రీ॥పూ॥ 586లో సంభవించెను. దీనిని గూర్చి మనము II రాజుల గ్రంథములోను, II దిన వృత్తాంతముల గ్రంథములోను చదువ గలము. ఆ కాలమందు యిర్మీయా (విలాపవాక్యములు), ఓబద్యా, నహూము, హబక్కూకు, జెఫన్యా అను ప్రవక్తలు ప్రవచించిరి.

**బందీలుగా యున్న కాలము :** యూదులు బబులోను బానిసత్వములో 70 సంవత్సరములు బందీలుగా యుందురని ప్రవక్తయైన యిర్మీయా ప్రవచించెను. గనుక ఇశ్రాయేలీయులు బబులోనులో బందీలుగా యున్నది తదుపరి కాలమై యున్నది. యిర్మీయా, దానియేలు, యెహెజ్కేలు ఆ కాలమందు ప్రవక్తలై యుండిరి.

**పునరుద్ధరణ కాలము :** తగిన సమయమందు యూదులను బందీలుగా విడిపింతునని దేవుడు వాగ్దానము చేసారు. ఆ కాలమును పునరుద్ధరణ కాలమని మనం చెప్పుకోవచ్చును. అది క్రీ॥పూ॥ 520–516 కాలములో ఎజ్రా నెహెమ్యాల నాయకత్వములో సంభవించెను. ఎస్తేరు కూడ అదే కాలమునకు చెందినట్టిదే. హగ్గయి, జెకర్యా, మలాకీ అనువారు ఆ కాలము నాటి ప్రవక్తలు. ఎస్తేరు యొక్క కధనము పర్షియా దేశములో జరిగెను. బబులోను రాజును, అతని రాజ్యమును పర్షియా స్వాధీనము చేసికొనెను. కోరెషు అను రాజు ఇశ్రాయేలీయులు తమ స్వదేశమునకు తిరిగి పోవచ్చునని సెలవిచ్చెను.

**నిబంధనల మధ్య కాలము :** పాత క్రొత్త నిబంధనల మధ్య నాలుగు వందల సంవత్సరముల కాలముండెను. ఈ కాలమందు పర్షియా దేశము మాసిదోను ఫిలిప్పు అనువానికిని, అతని కుమారు డగు అలెగ్జాండరు చక్రవర్తి వలన ఓడించబడెను. వారు గ్రీకు సామ్రాజ్య మును, గ్రీకు భాషను మధ్యధరా ప్రాంత మంతయు వ్యాపింపజేసిరి. అయితే గ్రీకు సామ్రాజ్యమును రోమా సామ్రాజ్యము కూలద్రోసెను. మనమెరిగి నట్లు రోమా సామ్రాజ్యము బహు ప్రఖ్యాతి గాంచిన దాయెను. రోమాయులు మంచి రహదారులను నిర్మించిరి. బహుగా విస్తరించిన వారి సామ్రాజ్యములో వారి చట్టమును అమలుపరచిరి. తద్వారా శాంతి నెలకొల్పబడెను. వారు బహు ప్రాచుర్యముగా తపాల పద్ధతిని ప్రవేశ పెట్టిరి. తండ్రియైన దేవుడు తన కుమారుని ఈ లోకమునకు పంపించు వాతావరణమునకు ఈ పద్ధతులన్నియు ఉపయోగపడెను.

**యేసు క్రీస్తు జీవిత కాలము :** పాత నిబంధనలోని వందలకొలది ప్రవచన ముల నెరవేర్పుగా యేసుక్రీస్తు ఈ లోకమున కవతరించెను. పాపులను రక్షించుటకు ఆయన ఈ లోకమునకరు దెంచెను. 33 1/2 సంవత్సరములు జీవించెను. ఆయన రాకడ కొరకు సమస్తము సిద్ధము చేయబడెను. ఇశ్రాయేలీయులు స్థిరపడిరి. మోషే ధర్మశాస్త్రము వారికీయబడెను. వారు నివసించుటకు పాలస్తీనా దేశము ఈయబడెను. తండ్రియైన దేవుడు యేమి చెప్పారో దానిని చేయుటకు యేసు సంసిద్ధుడై వచ్చెను. సిలువపై ఆయన మరణించెను. పాప పరిహార్ధా బలిగా తన్ను తాను సమర్పించుకొనెను. సమాధి చేయబడెను. మృతులలో నుండి మూడవ దినమున తిరిగి లేచెను. తదుపరి పరమునకారోహ ణమాయెను.

**క్రీస్తు సంఘము / రాజ్య కాలము :** యేసు తన సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). ఆయన రాజ్యమైన సంఘము పెంతెకొస్తు నాడు యెరూషలేములో అపొస్తలుల తోను, మూడువేల మందితోను స్థాపించబడెను. అపొ.కా. 2వ అధ్యాయం ఈ సంగతి విశదపరచుచున్నది. క్రీస్తు సంఘము (క్రీస్తు రాజ్య) కాలము తరువాత వేరొక కాలము వుండదు. యిది యేసు క్రీస్తు రెండవ రాకడ వరకు యుండును.

బైబిలు చరిత్రను మనం ఈవిధముగా తెలిసికొనుట ప్రాముఖ్యము. దేవుడు పని చేయు విధానమును తెలిసికొని ఆయన వర్తమానము నందు విశ్వాసము కలిగి ఆయన ప్రేమకు విశ్వాసముతో విధేయత చూపుట అవుసరం.

**– పాల్ హాలెండ్**

# దేవుడు మన తండ్రి
## (God Our Father)

*- Loy Mitchell*

**పరిచయము :**

1) యేసు నేర్పిన మాదిరి ప్రార్థనలో దేవుని యొక్క ముఖచిత్రమును మనము గ్రహించుకొనవచ్చును (మత్తయి 6: 9-13).

2) మానవమాత్రులైన మనకు దేవుని వర్ణించుటకు, ఆయనతో గల సంబంధ మును వర్ణించుటకు బైబిలులో అనేక రీతులుగా తెలియజేయబడినది.

3) సర్వ సంగ్రహముగా దేవుని వర్ణించుటకు యేసు ఒకే ఒక్క పదజాలమును వినియోగించలేదు. గాని ఆయన తత్వాన్ని మనం గ్రహించులాగున దేవుని ఆయన మనకు బయలుపర్చారు.

4) కుటుంబములోని సంబంధమును వర్ణించు పదమును ఆయన మన కొరకు వినియోగించారు. అదే దేవుడు మన తండ్రియను భావము.

**దేవుడు ఎట్టి రీతిగా మన తండ్రియవుతారు?**

- సార్వజానిక భావముతో దేవుడు మనకు తండ్రియగుదురు అని ఆయన ఉద్దేశ్యమా?
- దేవుడు సర్వ మానవాళిని సృజించారు (అపొ.కా. 17:28).
- క్రీస్తు యొక్క బోధలలోను, క్రొత్త నిబంధన యంతటిలోను దేవుడు మన తండ్రియను మాటలో ఆయనకును ఆయన బిడ్డలకును మధ్యయున్న ఆత్మీయ సంబంధము తెలియబడుచున్నది.
- మనం ఆయన యొక్క ఆత్మీయ బిడ్డలము (గలతీ 3:26-27).
- యేసు బయలుపరచుచున్న దేవుడే నిజమైన దేవుడు. ఆయనే రక్షించు దేవుడు. ఆయన మనందరి కొరకు ఉన్నత ఉద్దేశ్యము గలవాడు.

**A. దేవుడు మన తండ్రియనుటలోని భావమేమిటి?**

- అనగా ఆయనతో మనకు మనతో ఆయనకు సంబంధమున్నది.
- క్రొత్తగా జన్మించిన శిశువు తల్లి దండ్రుల వలె మొదట కనబడక పోవచ్చును. గాని ఆ బిడ్డ పెరుగు చుండగా ప్రతివారు వానిని గుర్తుపట్టవచ్చును.
- నేను దేవుని బిడ్డయైన యెడల, దేవుని పోలిక నాలో యుండాలి.

- నేను దేవుని బిడ్డనైతే ఆయన వలె ఆలోచించాలి.
- నేను నా శత్రువులను ప్రేమించాలి (మత్తయి 5:43-48).

**B. తండ్రియనగా బాధ్యత వహించుట:**

- నీకు సంతానము కలిగినప్పుడు బాధ్యతను స్వీకరిస్తావు.
- దేవుడు నిన్ను తన కుటుంబములోనికి పిలిచినప్పుడు అనాధవలె విడిచిపెట్టడు.
- ఆయన నా ఆత్మీయ అవుసరము లన్నియు తీర్చును. తద్వారా నిత్యము ఆయనతో ఉండవీలగును (I యోహాను 2:25).
- ఆయన నా బలహీనతలన్నీ ఎరుగును గనుక నన్ను బలపరచును (హెబ్రీ 4:16).
- ఆయన ప్రేమను లోకమంతా చాటు బాధ్యతను ఆయన మనకప్పగించారు.
- ఆయన తన కుటుంబాన్ని ఉన్నత మార్గములో నడిపించును (2 పేతురు 1:10; రోమా 6:23).

**C. దేవుడు మన తండ్రియనగా ఆయన క్రమశిక్షణలో మనం నడవాలియని అర్థము.**

- మనము బాప్తిస్మము పొందుట ద్వారా దేవుని చిత్తానికి లోబడితిమి గనుక, ఆయన కుటుంబ సభ్యులమైతిమి. ఆయన మన ఆత్మల తండ్రి అయ్యారు.
- దేవుడు క్రమశిక్షణ అమలుపరచునని బైబిలు బోధించుచున్నది (హెబ్రీ 12: 6-11).
- మన శారీరక తండ్రులు క్రమశిక్షణ అమలు చేయడంలో పొరబాట్లు చేస్తారు గాని అనంత జ్ఞానియైన తండ్రియైన దేవుడు పొరబాట్లు చేయరు.
- ఆయన వాక్యము ద్వారా మనలను క్రమశిక్షణలో యుంచుచున్నారా? (కీర్తన 119:105).
- మన అహంకారమును బట్టి సర్వ సమృద్ధి గల వారమని తలంచుచున్నప్పుడు దేవుడు నిజమైన తండ్రి గనుక మనలను శిక్షించును.
- దేవుడు మనందరినీ నిత్యజీవము కొరకై సిద్ధపరచుచున్నారు.

**ముగింపు :**

- దేవుడు మన పరలోకపు తండ్రి! మన భౌతిక తల్లిదండ్రులు గతించి పోదురు గాని తండ్రియైన దేవుడు నిత్యుడు (యెష 57:15).
- ఈ లోకంలోనే ఆయనను మన తండ్రిగా చేసికోలేకపోతే పరలోక ములో ఆయన మన తండ్రియగునా?
- మరణద్వారములకు మనం సమీపించినప్పుడు, ఆయన బిడ్డల వలె మనలను స్వాగతించునా?

**- లోయ్ మిట్చెల్**

# నేను వారి మధ్య నుందును

# (There Am I in their Midst)

*- J.V. Thornton*



"ఎక్కడ ఇద్దరు ముగ్గురు నా నామమున కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" యేసు చెప్పెను (మత్తయి 18:20). యిది గొప్ప ఆదరణ కరమైన హెచ్చరిక. గొప్ప తలంపు. యేసు అందరి మధ్య ఉండరు. "క్రీస్తు బోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధ యందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించువాడు" (2 యోహాను 9).

క్రీస్తు నందున్న వారికిక సమస్తాశీర్వాదములు వున్నాయి (ఎఫెసీ 1:3). ఆయాశీర్వాదములలో రక్షణ క్రీస్తునందున్నది (2 తిమో 2:10). నమ్మి బాప్తిస్మము పొందినవాడు క్రీస్తులో ప్రవేశించును (గలతీ 3:26,27). తదుపరి మనం ఆయనలో నడువాలి (కొలస్స 2:6). మరియు ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల యేసు రక్తము మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:7). యేసు మనతో యుండాలంటే ఇవన్నీ అవసరము.

**కూడుకొనాలి :**

"ఎక్కడ ఇద్దరు ముగ్గురు నా నామమున కూడియుందురో" అనే మాటలలో కూడుకొనుట యొక్క ప్రాముఖ్యతను గూర్చి చెప్పబడినది. ఒకడు ఏకాంతముగా ఆరాధించవచ్చును గాని అతడు సంఘములో కూడుకొన కుండా ఆరాధించలేడు, మరియు సంఘారాధనలు వ్యక్తిగత ఆరాధనను బహిష్కరించవు.

ఇక్కడ మనం గమనించవలసిన సంగతి ఏమంటే సంఘముతో కలసి ఆరాధించినా ప్రతివాడు వ్యక్తిగతముగానే ఆరాధించును. సంఘముతో కలిసి చేయు వ్యక్తిగత ఆరాధన దేవునికి అంగీకార మగును. ఉదాహరణకు ఆరాధనలో అందరు కలిసి పాటలు పాడినా, ప్రతివాడు వ్యక్తిగతముగానే పాడును.

హెబ్రీ పత్రిక లేఖకుడు ఇట్లు చెప్పుచున్నాడు : "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకనికొకడు హెచ్చరించుచు ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగున చేయుచు ప్రేమ చూపుటకును సత్కార్య ములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" (హెబ్రీ 10:24-25). గొప్ప హింస, బానిసత్వము, బాధలు ప్రబలియున్న ఆ రోజులలో కూడ సమాజముగా కూడు కొనుట మానకూడదని క్రైస్తవులు హెచ్చరింపబడిరి. అట్లయినప్పుడు అన్నీ సుఖముగా మనకు జరుగుచున్న ఈ రోజులలో మనం సమాజముగా కూడుకొనుటకు మరింత ఎక్కువ శ్రద్ధ వహించాలి గదా!

**యేసు నామమున :**

"ఇద్దరు ముగ్గురు ఎక్కడ నా నామమున కూడియుందురో" యని యేసు చెప్పారు. ఆయన నామమున మనం చేయవలసిన అనేక సంగతులు మనకు చెప్పబడ్డాయి. ఆయన నామమున బాప్తిస్మము పొందాలి, ప్రార్థించాలి, పాటలు పాడాలి, కృతజ్ఞత చెల్లించాలి మొదలగునవి. "మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

యేసు నామమున చేయడం అంటే అర్థం యేమిటి? అంటే యేసు యొక్క అధికారము చొప్పున అని అర్థం. గనుక ఇద్దరు ముగ్గురు ఎక్కడ నా నామమున కూడియుందురో యని యేసు చెప్పినప్పుడు, నా అధికారము చొప్పున ఇద్దరు ముగ్గురు ఎక్కడ కూడియున్నను అని ఆయన యొక్క అభిప్రాయము. 'యేసు నామమున' అనే పదములకు మనం అర్థం గ్రహించినట్లయితే మిగతా

లేఖన భాగములు మనకు తేలికగా అర్ధమగును. మార్కు 9:38లో "యోహాను–బోధకుడా, ఒకడు నీ పేరట దయ్యములు వెళ్ళగొట్టుట చూచితిమి; వాడు మనలను వెంబడించువాడు కాడు గనుక వానిని ఆటంకపరిచితిమని చెప్పెను". అందుకు యేసు వానిని ఆటంకపరచకుడి, మనకు విరోధి కానివాడు మన పక్షమున నున్నవాడేయని చెప్పెను. యేసు యొక్క అధికారము చొప్పున చేయువారి విషయములో మాత్రమే ఈ సూత్రము వర్తించును.

**నేను వారిమధ్య నుందును :**

యిదొక గొప్ప వాగ్దానము. మనం ఆరాధనకు కూడుకొనునప్పుడు యేసు అక్కడ యున్నారంటే మనకు గొప్ప ఆనందము కాదా? ఆయన భౌతికముగా కాదు గాని ఆత్మీయముగా యుంటారు. ప్రతి బహిరంగసభలోను గాక, ఆయన నామమున జరిగే ప్రతి సభలోను, కూటములోను యుంటారు.

ఆయన ఉనికిని గూర్చి మనం ఎరిగి యుండుట లేదని నా యభిప్రాయము. నీవు ఆలయములో ప్రవేశించునపుడెల్లా యేసు నీతో కూడ వచ్చి నీ ప్రక్కన కనబడే లాగున కూర్చున్నారనుకో, నీకెట్లుంటాది? పాటలు పాడుచున్నప్పుడు ఆయన నీ ప్రక్కనే యుంటే పాడుదువా? ప్రార్థన సమయంలో ఆయన నీ దగ్గరయుంటే ఏవేవో కలలు కందువా? బోధించేటప్పుడు నీవు నిద్రలోకి జారిపోతావా? ప్రభు రాత్రి భోజన సమయంలో మధ్యాహ్నం భోజనం గూర్చి ఆలోచిస్తావా? యేసు నీ ప్రక్కనే కూర్చుంటే ఎక్కువ కానుక యిస్తావా? ఆరాధన అనంతరం యేసు నీతో కూడ బయటికి నడిచి వస్తే మిగతా వారిని పలకరించకుండా త్వరగా వెళ్లిపోతావా?

నిజానికి నీవేమి చేస్తావు? నీవాయనను చూడలేవు, గాని ఆయన నిన్ను చూచుచున్నారు. ఆయన అక్కడే, నీ ప్రక్కనే యున్నారు, ఏలయనగా "ఇద్దరు ముగ్గురు ఎక్కడ నా నామమున కూడియుందురో అక్కడ నేను వారి మధ్య నుందునని" ఆయనే చెప్పారు గదా! (మత్తయి 18:20).

**– జె.ఎ. తోరస్టన్**



# ఒక్క మాటలో యున్న శక్తి
# (The Power of One Word)

***- Owen Cosgrove***



1517లో మార్టిన్ లూథర్ కేథలిక్కు సంఘము నుండి విడిపోయినప్పుడు వేరొక సంఘాన్ని స్థాపించాలని అతడెన్నడు కోరుకోలేదు. విశ్వాస భ్రష్టత్వములో పడిపోయిన కేథలిక్కు సంఘాన్ని సవరించి, లేఖనములలో ప్రకాశించుచున్న సంఘముగా దాన్ని తీర్చిదిద్దాలని అతడు ప్రగాఢంగా కాంక్షించాడు.

పోపు యొక్క ఆధిపత్యాన్ని, సంఘ కౌన్సిళ్లను అతడు నిరాకరించాడు. అవి ఒకదానికొకటి పొసగనివియని అతడు చెప్పినప్పుడు పోపులియో X అతనిని బహిష్కరించెను. జర్మనీలో వోర్మ్స్ అను ఊరిలో అతడు విచారించబడినపుడు తాను చెప్పినదేమైనా లేఖన విరుద్ధము కానిదైతే దానిని ఉపసంహరించుకొనడా నికి నిరాకరించాడు. జర్మనీ చక్రవర్తియగు చార్ల్స్ V అనునతడు లూథరును నిషేధించినప్పుడు అతని మిత్రుడగు ఫ్రెడరిక్ ఎలెక్టర్ అతనిని పదిమాసములు దాచియుంచాడు. ఆ కాలములో లూథరు క్రొత్త నిబంధనను జర్మన్ భాషలోనికి తర్జుమా చేసాడు. అది చాల గంభీరమైన పని. దాని వలన జర్మన్ భాష ప్రసిద్ధి కెక్కుటయే గాక ఆ దేశమునకు మత

స్వాతంత్ర్యము లభ్యమయ్యింది.

క్రియలు మూలముననే రక్షణయనే సిద్ధాంతము అతనికి ఎంత హేయమైన దంటే అతడు దానికి భిన్నముగా యున్న విశ్వాసము వలన మాత్రమే రక్షణయని ప్రకటించాడు. ఒకడు క్రియలేమి చేయన క్కర్లేదు గాని విశ్వాసము వలన మాత్రమే రక్షింపబడునని అతడు ప్రకటించాడు. థియోలజీలో డాక్టరేట్ చదివిన లూథరు చాల ప్రజ్ఞ గల విధ్వాంసుడు. గాని విశ్వాసము వలన మాత్రమే రక్షణయను సిద్ధాంతము అతని ఆలోచనలనంతటిని ఆవరించుకొని యుండెను.

రోమా 3:28 వచ్చుసరికి అది “కాగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలు లేకుండ విశ్వాసము వలన మనుష్యులు నీతిమంతులుగా తీర్చబడుచున్నారని యెంచుచున్నాము” అని చెప్పుచుండగా లూథరు “విశ్వాసము వలన మాత్రమే” యను మాటలను అందుచేర్చాడు. అయితే అతని సిద్ధాంతము యాకోబు 2:24ను నేరుగా వ్యతిరేకించుచున్నదని ఒకరు గమనించారు. “మనుష్యుడు విశ్వాస మూలమున మాత్రమే గాక క్రియల మూలమునను నీతిమంతుడని యెంచబడునని మీరు దీని వలన గ్రహించితిరి” యని అది చెప్పుచున్నది. దీని వలన ఇబ్బందిలో పడిన లూథరు యాకోబు పత్రిక అంతయు “గడ్డిపరక పత్రిక” యని దానిని నిరాకరించాడు.

దేవుని వాక్యముకు కలిపిన ఒక్క మాటతో ఎంత తేడా వచ్చేసిందో! సదుద్దేశ్యంతోనే కలిపినా ఆ ఒక్కమాటలో ఎంత గందరగోళం వచ్చేసిందో! దేవుని వాక్యానికి మనం కలుపనూ కూడదు, చేర్చనుకూడదు. ఒక్క మాట కూడ కలుప కూడదు. దానిని దేవుడు నిషేధించారు.

లూథరు చేసిన తర్జుమాను మనం అనుసరించిన యెడల అది మారుమ నస్సును, ఒప్పుకోలును, బాప్తిస్మమును, కానుకలను, ప్రార్థనను, పఠనమును, హాజరగుటను, ప్రభు రాత్రి భోజనమును బయటకు నెట్టేయవచ్చును. మరియు క్రొత్త నిబంధన యిచ్చు ఆజ్ఞలు యేమీ నెరవేర్చకుండగానే రక్షింపబడవచ్చును. ఒక్క మాటను చేర్చుట వలన కలిగిన విపత్తు యిది.

విశ్వాసము ద్వారా రక్షణ కలుగునని అనేక వచనములు చెప్పుచున్నవి. విశ్వాసము వలన మాత్రమే రక్షణ కలుగునని చెప్పే లేఖనము యేదీ లేదు. ఒక్క మాటలో ఎంత తేడా యున్నదో! పది ఆజ్ఞలకు ఏదో ఒక్క మాట కలిపితే యేమగునో ఆలోచించుము! హవ్వతో సాతానుడు చెప్పిన ఒక్క మాట వలన ఎంత తేడా వచ్చినదో! అందువలననే దేవుని వాక్యాన్ని మనం అటు ఇటు మార్చకూడదు. బైబిలు చెప్పు దానిని మనం అనుసరిద్దాం.

**– ఆవెన్ కాస్‌గ్రోవ్**

# దేవుడు ఆలకించని సమయము

## (A Time When God will not Hear)

*- E.S. Underwood*



సామెతలు 28:9లో దేవుని గూర్చి మానవుని ప్రార్థనలను గూర్చి ఆసక్తికర మైన సంగతి కలదు. "ధర్మశాస్త్రము వినబడకుండా చెవిని తొలగించు వాని ప్రార్థన హేయము". అంటే మానవుని ప్రార్థన దేవుడు ఆలకించని సమయము న్నదా? అవును అని దేవుడే దీనికి జవాబిచ్చుచున్నారు. అట్లయితే ఆయన ప్రార్థనను ఎప్పుడు వినుటకు నిరాకరి స్తారు? దేవుని ధర్మశాస్త్రము మానవుడు వినుటకు నిరాకరించినప్పుడా? "నేను పిలువగా మీరు వినకపోతిరి, నా చేయి చాపగా ఎవడును లక్ష్యపెట్టకపోతిరి, నేను గద్దింపగా లోబడకపోతిరి. కాబట్టి ..... మీకు కష్టమును, దుఃఖమును ప్రాప్తించి నప్పుడు నేను అపహాస్యము చేసెదను. అప్పుడు నన్ను గూర్చి మొర్రపెట్టెదరు గాని నేను ప్రత్యుత్తరమీయను" (సామె 1:24-28).

"దేవుని నామమున ప్రార్థన చెయ్యండి" యని మనుష్యులు నేడు ప్రోత్సాహించుచున్నారు. ప్రార్థించి రక్షింపబడండి యని చెప్పేవారున్నారు. అట్టి వారు దేవుని వాక్యమునకు చెవి యియ్యక యున్నవారు. అట్టివారి ప్రార్థనలను దేవుడు వినరు. అవి దేవునికి అసహ్యము. ఆయన వాక్యము ద్వారా దేవుని మాటల నాలకించుడి. హృదయ పూర్వకముగా దానికి లోబడుడి. అప్పుడు ఆయన మీ ప్రార్థనల నాలకించును".

**- ఎర్నెస్ట్ అండర్‌వుడ్**

# దేవుని విభజన రేఖ

## (God's Dividing Line)

*- Gus Nichols*



ఇశ్రాయేలీయులు ఒక విగ్రహమును చేసికొని దానిని ఆరాధించినప్పుడు దేవుడు వారిని శిక్షించారు (నిర్గమ 32). "అందుకు మోషే పాళెము యొక్క ద్వారమున నిలిచి యెహోవా పక్షమున నున్నవారందరు నా యొద్దకు రండి అనగా లేవీయులందరు అతని యొద్దకు కూడివచ్చిరి" (నిర్గమ 32:26). ఆ రోజు దేవుడొక విభజన రేఖను ఏర్పరచారు.

దేవుడు నీటిని తరుచు విభజన రేఖగా వినియోగించారు.

**జలప్రళయము పాత క్రొత్త జనములకు విభజన రేఖ ఆయెను (ఆది.కా. 6:5- 7;17):** నాడున్నటువంటి దుష్టత్వమునకు జవాబుగా దేవుడు ఆనాటి లోకమును గొప్ప జలప్రళయము ద్వారా నాశనము చేసారు (ఆది.కా. 6:17). అయినను యెహోవా దృష్టిలో నోవహు కృప పొందిన వాడాయెను (ఆది.కా. 6:8). సంభవింపబోవుచున్న వినాశనమును గూర్చి అతడెట్లు స్పందించాడో గమనిం చుము (ఆది.కా. 6:22; 7:5). దేవునికి విధేయత చూపుట వలన నోవహు జీవితములో ఎట్టి పర్యవసానములు సంభవించాయి?

రాబోవుచున్న తీర్పునకు అతడు సిద్ధపడకుండా యుండలేదు (మత్తయి 24:37-39). అతడు దేవుని యందలి భయభక్తులతో ప్రవర్తించాడు. గనుక అతని కుటుంబమును రక్షించుకో గలిగాడు (హెబ్రీ 11:7).

**ఎఱ్ఱ సముద్రము :** బానిసత్వము నకును, స్వాతంత్ర్యమునకును మధ్యనున్న విభజన రేఖ! (నిర్గమ 14:1-31) యోసేపు జీవిత కాలములో ఐగుప్తులో యున్న ఇశ్రాయేలీయులు **శాంతిని,** సుఖాన్ని అనుభవించారు. అయితే యోసేపు మరణించిన తరువాత అతని ఎరుగని ఫరో రాజు పాలించుట మొదలిడారు (నిర్గమ 1:8). అతడు ఇశ్రాయేలీయుల జీవితమును దుర్భరము చేసాడు (నిర్గమ 1:9-14). వారి యొక్క కఠిన జీవితమును గూర్చి ఇశ్రాయేలీ యులు ప్రేలాపింపగా, యెహోవా వారి మొరను వినెను (నిర్గమ 2:23-24; 3:7). వారిని విమోచించు టలో దేవుడు వారిని ఒక చోటికి నడిపించెను. అది ఫరో సైనికుల నుండి తప్పించుకో లేనట్లున్న ప్రదేశము. అయితే దేవుడు ఎఱ్ఱ సముద్రమును రెండు పాయలుగా చీల్చగా ఇశ్రాయేలీ యులు ఆపిన నేలను, ఆ సముద్రమును దాటిరి. స్వతంత్రులైరి. వారు ఎఱ్ఱ సముద్రమును ఏ శక్తి వలన దాటగల్గిరి? అది యెహోవా దేవుని యందలి వారి విశ్వాసము, విధేయత (హెబ్రీ 11:29). మరొకసారి విధేయత చూపు విశ్వాసము ఐగుప్తీయు లకు ఇశ్రాయేలీయులకు మధ్య విభజన రేఖ ఆయెను.

**యోర్దాను నది :** నయమాను యొక్క కుష్టు రోగముకు, దైవిక స్వస్థతకు మధ్య నున్న విభజన రేఖ ఆయెను (2 రాజులు 5: 1-14). నయమాను సిరియా దేశపు సైన్యాధిపతి. దేవుని అనుగ్రహము వలన అతడు విజయము సాధించాడు. అతడు ధీరుడు, శూరుడు. అయితే అతడు కుష్టు రోగి. గాని కుష్టు రోగము నుండి శుద్ధు డగుటకు అతడు యోర్దాను నదిలో ఏడు మారులు మునగవలసివచ్చెను.

**నేర్చుకోదగిన పాఠము :** దేవుని వాక్యము నకు మనము విశ్వాసముతో కూడిన విధేయత చూపాలని దేవుడు కోరుచున్నారు. పైనుదహరించిన అన్ని సందర్భములలోను విధేయత ముఖ్యమైనది. సువార్తకు మనము విధేయులము కావాలని దేవుడు కోరుచున్నారు (మార్కు 16:16; అపొ.కా. 2:38).

నీ సంగతి యేమిటి? దేవుని విభజన రేఖను దాటావా? అట్లయితే నీ కొరకు అనేక ఆశీర్వాదములు వేచియున్నాయి (ఎఫెసీ 1:3). ప్రభువు ఆజ్ఞలకు విశ్వాసముతో కూడిన విధేయత చూపిన వారికి స్థలము సిద్ధపరచుటకు ప్రభువు పరమున కేతెంచారు (యోహాను 14:3).

**- గస్ నికొల్స్**

# చరిత్రాత్మకుడైన యేసు

## (The Historical Jesus)

***- David Fanning***

పౌరాణిక ప్రజలందరి కంటె యేసును గూర్చిన ఋజువులు చరిత్రలో బోలెడున్నాయి (BC 4 - AD 30). 5000 గ్రీకు లిఖిత పత్రములు, వేలకొలది క్రొత్త నిబంధన ప్రతులు, పురాతనమైనవి నేటికిని ఉన్నాయి. అవి ఇంచుమించు క్రీ॥శ॥ 130లో వ్రాయబడి ఉంటాయి. యేసు భూమి మీద నివసించిన మానవుడని, దేవుని కుమారుడని తెలియజేయుచున్నాయి.

ఆత్మావేశ లేఖకులైన 8 మందిచే క్రొత్త నిబంధన వ్రాయబడినది. వారి వ్రాతలన్నిటిలో 1500 సార్లు యేసును గూర్చి చెప్పారు. ఆ లేఖకులలో కొందరు ఆయన పరిచర్య చేయుచున్న కాలములో ఆయనతోనే యున్నవారు. (ఉదా : మత్తయి, యోహాను, పేతురు). మరికొందరు ఆయనతోను లేక ఆయన శిష్యులతోను సన్నిహిత సంబంధము గలవారు. (ఉదా : మార్కు, యాకోబు, యూదా, లూకా). ఆయన పునరుత్థానుడైన 15 సంవత్సరముల కాలములోనే వారు యేసును గూర్చి వ్రాసారు.

యేసు యొక్క సహోదరుడైన యాకోబు బహుశ క్రొత్త నిబంధన లేఖకులలో ప్రథముడు. అతడు చారిత్రాత్మకుడని క్రొత్త నిబంధన లేఖనములే గాక యూదుల చారిత్రాత్మక లేఖకుడైన జోసిఫస్ కూడ అంగీకరించాడు. అతడు క్రీ॥శ॥ 37-100 కాలములో జీవించిన చరిత్రకారుడు. క్రీ॥శ॥45లో యాకోబు ఇట్లు వ్రాసాడు : “దేవుని యొక్కయు ప్రభువైన యేసుక్రీస్తు యొక్కయు దాసుడైన యాకోబు అన్యదేశముల యందు చెదరి యున్న పంద్రెండు గోత్రముల వారికి శుభమని చెప్పి వ్రాయునది” (యాకోబు 1:2).

క్రొత్త నిబంధనలో యున్న ఋజువులే యేసు క్రీస్తు దేవుని కుమారుడని నిరూపించుటకు బోలెడంత సరిపోతాయి. ఆయన ఒకప్పుడు భూమి మీద చలించారు, మృత్యుంజయుడై పరమునకారోహణుడయ్యారు. ఆయనను బట్టియే మానవ చరిత్ర అంతయు క్రీస్తు పూర్వమనియు, క్రీస్తు శకములో అనియు లెక్కింపబడుచున్నది.

**– డేవిడ్ ఫేనింగ్**



# క్రీస్తును వెంబడించితే గొప్ప యేమిటి?

## (What is Great in Following Jesus)

***- Roger Campbell***



జీవితం యొుక్క నిజమైన సమాధానము మరియు సంతోషమును యేసు అనుగ్రహించును.

"ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని యేసు వాగ్దానము చేసెను (మత్తయి 11:28). అలసినవారికి నిజమైన విశ్రాంతి యేసులో యున్నది. ఐతియొపియా నుండి వచ్చిన మనుష్యుని ఉదాహరణ తీసికొనుము. అతడు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిన తరువాత సంతోషించెను (అ.పొ. 8:36-39).

రక్షకుని సేవించువాడు తాను ప్రభువు చిత్తమును జరిగించుచున్నాననియు, తన సృష్టికర్తకు గౌరవము చూపుచున్నాననియు మరియు ఆయన ఆజ్ఞలను అనుసరించుచున్నాననియు, అది మానవకోటికి విధి అని అతడు ఎరిగి సంతృప్తిని కలిగియుండును (ప్రసంగి 12:13).

సమాధానకరమైన మనస్సు మరియు ఆనందముతో ప్రభువు మనతో ఉండుననియు మరియు ఆశీర్వదించుననను విశ్వాసం వచ్చును. ఆయనకు మనం నమ్మకముగా ఉండినట్లయితే, అప్పుడు ఆయన వాగ్దానములు నిజమగును. "నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13:5). మరియు "అయితే ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమైయుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును (I యోహాను 1:7).

"వచ్చి చూడుడి" (యోహాను 1:3).

**- రోజర్ కేంప్‌బెల్**

# క్రీస్తును గూర్చి మీరేమనుకొనుచున్నారు?

## (What do you Think of Christ?)

*- Charles R. Rose*

మత్తయి 22:36-40లో యేసు ప్రధానమైన రెండు ఆజ్ఞలను గూర్చి చెప్పారు. నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణాత్మతోను, పూర్ణ మనస్సుతోను ప్రేమింపవలె ననునది ప్రధానమైనదియు, నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించ వలెననునది రెండవదియునని ఆయన తెలియజేసారు. ఆయనను శోధించుచు పరిసయ్యుడొకడు ఆయనను ప్రశ్నింపగా ఆయన యిచ్చిన జవాబు అది. ఆయన అతనికి జవాబిచ్చి, పరిసయ్యులు కూడి యుండగా, "క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని వారినడిగెను" (మత్తయి 22:41,42).

క్రొత్త నిబంధనను మనం చదువు చుండగా ప్రభువు వివిధ రకములైన మనుష్యులతో సంభాషించుచున్నట్లు గమనించగలము. క్రీస్తును గూర్చి వారందరికీ ఏదో ఒక అభిప్రాయము ఏర్పడియుండవచ్చును. అక్రమకారులైన మనుష్యుల చేత పరిసయ్యులు అబద్ధ సాక్ష్యము చెప్పించి వారు యేసుకు శిక్ష పడేలాగున చూసారు (మార్కు 14:57-58). యోగ్యులైన మంచి మనస్సు గల వారు క్రీస్తును గూర్చిన వారి యభిప్రాయములను తెలియజేసిన వారి మాటలను ఇప్పుడు కొంత పరిశీలించుదము.

**దూతలు :** కన్యయైన మరియ ఒక శిశువుకు జన్మనీయనగా గొర్రెలకాపరులకు దూతలు "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" అని తెలియజేసారు (లూకా 2:11).

**తండ్రియైన దేవుడు :** యొర్దాను నదిలో యేసు యోహాను చేత బాప్తిస్మము పొంది నీళ్ల నుండి వెడలి రాగా, ''ఇదిగో ఆకాశము తెరువబడెను. దేవుని ఆత్మ పావురము వలె తన మీదిగి దిగి వచ్చుట చూచెను. మరియు ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:16-17).

**బాప్తిస్మమిచ్చు యోహాను :** యేసు యొక్క దైవత్వాన్ని యోహాను గుర్తించాడు. అతడు తన శిష్యులతో, ''ఇదిగో లోక పాపములను మోసికొనబోవు దేవుని గొర్రె పిల్ల" యని చెప్పెను (యోహాను 1:29).

**పేతురు :** తనను గూర్చి వారేమనుకొను చున్నారని యేసు తన శిష్యులనడుగగా,

పేతురు "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పుకొనెను (మత్తయి 16:16).

**దయ్యములు :** ఆయన యొక్క సర్వశక్తిని బట్టి యేసు అన్నిరకములైన వ్యాధులను బాగు చేసెను. దయ్యములు పట్టినవారి నుండి వాటిని వెళ్లగొట్టెను. "ఇంతేగాక దయ్యములు నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను విడిచిపోయెను" (లూకా 4:41).

**ఆయనను అప్పగించిన యూదా :** యేసు బంధింపబడుట చూచి, "నేను నిరపరాధ రక్తమును అప్పగించితినని ఒప్పుకొనెను (మత్తయి 27:4).

**పిలాతు :** యేసు అధిపతియైన పిలాతు నొద్దకు తేబడగా అతడాయనను హేరోదు నొద్దకు పంపించెను. పిలాతు ప్రజలతో, "ఇదిగో నేను మీ యెదుట ఇతనిని విమర్శింపగా మీరితని మీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడ లేదనెను" (లూకా 23:14-15).

**పిలాతు యొక్క భార్య :** యేసును గూర్చి కలవరపడి కలగని ఆయన నీతిమంతు డని ఒప్పుకొనెను (మత్తయి 27:19).

**శతాధిపతి :** యేసు సిలువ వేయబడుట చూచి, తదుపరి సంభవించిన భూకంపమును బట్టియు, ప్రకృతిలో సంభవించిన వికృతములను బట్టియు, **"నిజముగా ఈయన దేవుని కుమారుడని"** ఒప్పుకొనెను (మత్తయి 27:54).

**తోమా :** యేసు మృతులలో నుండి తిరిగి లేచెనని మిగతా శిష్యులు చెప్పుచున్న మాటలను తోమా శంకించాడు. అయితే మేకులు కొట్టబడిన ఆయన చేతులలోను, కాళ్లలోను యున్న గాయములను అతడు స్వయముగా తాకి, "నా దేవా, నా ప్రభువా" యని అరచెను (యోహాను 20:28).

మనలను సత్యమును గూర్చి ఒప్పించ డానికి ఎంతమంది సాక్షులు అవుసరము? యేసు యొక్క మిత్రులు, శత్రువులు, తటస్థముగా యున్నవారు కూడ అందరు యేసును గూర్చిన యదార్థ వాస్తవములను ఎదుర్కొనవలసి వచ్చినది. నజరేయుడైన యేసును గూర్చి వారు చెప్పిన మాటలను ఇంతవరకు పరికించాము.

ఈ వ్యాసమును చదువుచున్న నీకు కూడ పరిసయ్యులకు వేయబడిన ప్రశ్నయే వేయబడుచున్నది : "క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడు?".

**- చార్ల్స్ రోజ్**



# ఎవరి విశ్వాసం గొప్పది?

## (Who has the Greatest Faith?)

***- Jerry Bates***



నీకు తెలిసినవారిలో ఎవరి విశ్వాసము అందరికన్నా గొప్పది? సాధారణంగా మా బోధకునిది, సంఘ పెద్దలది లేదా కుటుంబానిదియని చాల మంది చెబుతారు. తమ బోధకుడు వారి కొరకు ప్రార్థన చేయాలని చాల మంది కోరుదురు. మిగతావారి కంటె అతని ప్రార్థనలో శక్తియున్నదని వారు తలస్తారు. పైన చెప్పుకొన్నవారి విశ్వాసము గొప్పదనే మన ఆశాభావము, అయితే మిగతా వారికంటే వారి విశ్వాసము అంత గొప్పదేమి కాదు. ఏలయనగా బైబిలును పఠించిన మనం అనుకొనని వారి యొక్క విశ్వాసము చాలసార్లు బలమైనదిగా కనపడును.

ఉదాహరణకు యేసుక్రీస్తు కొందరి విశ్వాసము అల్పమైనదని మూడుసార్లు చెప్పారు. రెండు సందర్భాలలో 12 మంది శిష్యుల వలె అల్పవిశ్వాసులైనట్లు కనుగొనగలము (మత్తయి 8:23-27; 16:5-12). మూడవ సందర్భములో నీళ్ల మీద నడుచుచున్న పేతురు మనకగుపడ్డాడు (మత్తయి 14:22-36). యిది ఆశ్చర్యము. ఏలయనగా ఎవరికైనా బలమైన విశ్వాసము వుంటే వారు వీరే అయ్యుండాలి! వారు అనుదినము యేసును వెంబడించుచు ఆయన చేయుచున్న అద్భుతములను చూస్తూ వచ్చారు. అయితే వారి విశ్వాసము తగురీతిగా అభివృద్ధి జెందలేదు.

సరిగదా యేసు కొందరిని తమ విశ్వాసమును బట్టి మూడు సందర్భాలలో కొనియాడారు. లూకా 7:1-10లో ఒక ఉదాహరణ మనకున్నది. రోమా శతాధి పతి యొకడు యేసునొద్దకు వచ్చి తన దాసుని స్వస్థతను గూర్చి యేసుకు మనవి చేసాడు. యేసు నొద్దకు తాను వచ్చుటకు గాని, యేసు అతని ఇంటికి వెళ్లుటకుగాని

తాను పాత్రుడను కానని అతడు ఒప్పు కొన్నాడు. ఇశ్రాయేలులో సయితము అంత గొప్ప విశ్వాసాన్ని తాను కనుగొన లేదని యేసు చెప్పారు (లూకా 7:9).

రెండవ ఉదాహరణ మార్కు 5:25–34లో వ్రాయబడియున్నది. ఇక్కడ దీర్ఘ కాలరోగియై యున్న ఒక యూదురాలు యేసు తన రోగమును బాగుచేయునని విశ్వసించినది. ఆయన శక్తి యందు ఎంత బలముగా నమ్మినదంటే తాను యేసు యొక్క వస్త్రపు చెంగును ముట్టిన చాలు బాగుపడుదుననుకొనెను. ఆమె అట్లు చేసి స్వస్థత పొందగా ఆమె యొక్క విశ్వాసము ఆమెను బాగుచేసెనని యేసు చెప్పెను (మార్కు 5:34). ఆమె యొక్క విశ్వాసము గొప్పదని యేసు చెప్పక పోయినా, ఆయన ఆమె యొక్క విశ్వాసమును శ్లాఘించెననుట వాస్తవమే.

మూడవ ఉదాహరణ మత్తయి 15: 21–28లో వ్రాయబడియున్నది. కానాను స్త్రీ యొకతె యేసునొద్దకు వచ్చి దయ్యము పట్టి బాధపడుచున్న తన కుమార్తెను స్వస్థ పరచుమని వేడుకొనెను. అందుకాయన ఆమెతో ఒక్క మాటయైనను చెప్పలేదు, గాని ఆమె పట్టు విడువక ప్రార్థింపగా ఆమె కోరిన దీవెన పొందెను. "యేసు అమ్మా నీ విశ్వాసము గొప్పది" అని ఆమెతో చెప్పెను. ఈ మూడు సందర్భములను గమనించుము. రోమా శతాధిపతి, రోగియైయుండి యూదు రాలైన కానాను స్త్రీ. నిజానికి గొప్ప విశ్వాసానికి మాదిరిగా ఇట్టి వారు కనబడరు గదా.

ఈ రెండు గుంపులను పరికించితే మనంయేమి నేర్చుకోగలము? కొందరితో సహవాసము చేసినంత మాత్రమున బలమైన విశ్వాసము చేకూరదు. శిష్యులే యేసుతో సన్నిహితముగా మెలిగినను అల్ప విశ్వాసులుగా అగుపడుచున్నారు. గనుక చాల కాలము నుండి క్రైస్తవుడనై నందున నా విశ్వాసము గొప్పదని మనం ఊహించరాదు. నిజానికి బలమైన విశ్వాసము గలవాడు క్రొత్తగా క్రైస్తవుడయి నవాడు కావచ్చును.

రెండవది, మనం నేర్చుకోవలసినది యేమంటే గొప్ప విశ్వాసముతో గొప్ప వినయము కనబడును. శతాధిపతి యేసు నొద్దకు వచ్చుటకు తాను పాత్రుడను కానని తలంచాడు. కానాను స్త్రీ యేసు ఎదుట ఒక కుక్కపిల్ల లాంటిదానినని తన్ను తాను తగ్గించుకొన్నది. రోగియైన స్త్రీ యేసు యొక్క వస్త్రపు చెంగు ముట్టితే చాలనుకొన్నది. యిది ఇలాగుండగా శిష్యులైతే వారిలో ఎవడు దేవుని రాజ్యములో గొప్పవాడోయని తర్కించు కొనుచుండిరి.

దేవుని గొప్ప సేవకులందరు వినయ విధేయతలు గలవారు. ఉదాహరణకు బాప్తిస్మమిచ్చు యోహానును గమనించు ము. "స్త్రీలు కనిన వారిలో బాప్తిస్మమిచ్చు యోహాను కంటె గొప్పవాడు పుట్టలేదని"

యేసు చెప్పెను (మత్తయి 11:11). యివి శ్లాఘనీయమైన చాల గొప్ప మాటలు. అయినను యేసును గూర్చి చెబుతూ "ఆయన చెప్పులవారును విప్పుటకైనను నేను యోగ్యుడను కానని" చెప్పెను (యోహాను 1:27). అంతగొప్ప మనుష్యుని నుండి వచ్చిన ఈ మాటలు నిజంగా గొప్పవే. చివరిగా మనం నేర్చు కోవలసిన గొప్ప పాఠం యేమంటే, గొప్ప విశ్వాసములో యేసు నందు సంపూర్ణ నమ్మిక ఇమిడియున్నది. సంపూర్ణ నమ్మిక అంటే ఎన్ని అభ్యంతరములు కలిగినను ఆయనకు విధేయులగుటయే. శిష్యులే తరుచు ఈ లోకమువైపు చూస్తూ యుండే వారు. పేతురు యేసు వైపు మాని నీటి వైపు చూచే వరకు నీళ్ల మీద నడువగలి గాడు. యేసు నందు సంపూర్ణ నమ్మిక కోల్పోయాడు. మునిగిపోయాడు. అయితే దేవుడు మనలను రక్షించును, రక్షించగలడుయని యేసు నిరూపించారు. దానిని మనం నిజంగా నమ్ముచున్నామా? లేకపోతే మనది అల్ప విశ్వాసమే (మత్తయి 6:30).

నిరుత్సాహ ఘడియలలో కూడ మనం యేసు నందు విశ్వాసముంచాలి. మనందరికీ అట్టి ఘడియలు సంభవిస్తాయి. గొప్ప విశ్వాసము వలన ఎట్టి అవాంతరాలనైనా అధిగమించ గలము. రక్తస్రావముతో బాధపడుచున్న స్త్రీ గొప్ప జనసమూహములో నుండి సయితము యేసు వస్త్రపు చెంగును ముట్టుకొని గొప్ప విశ్వాసము వలన స్వస్థత పొందినది. అయితే గొప్ప జనసమూహమున్నదని తలంచి ఎంత మంది వెనుకకు పోయారో గదా!

కానాను స్త్రీ తాను అన్యురాలనైనం దున యేసు ఆమెను పట్టించుకోవడం లేదను కొనినను తన పట్టు విడువలేదు. యేసు యొక్క మాటలను బట్టి ఆమె సులభముగా అభ్యంతరపడి యుండేది, గాని తాను ఆశించిన దీవెన పొందకుండా పోయేది. ఎవరో ఏదో అన్నారని అభ్యంతరపడి కొందరు ఆరాధనకు రాకుండా పోతారు. అవి చాల స్వల్పముగాని, వారికి ఘోరంగా కనబడ్తాయి. క్రీస్తు శరీరము నుండి తమ్మును తాము వేరైపోయినందున అనేక దీవెనల నుండి తమకు తాము వారు వేరైపోవుదురు. చివరికి పరలోకములో నిత్యగృహాన్ని కోల్పోదురు. గొప్ప విశ్వాసము గలవారు దేవునిని, ఆయన కుటుంబమును విడిచిపెట్టరు. మనము కూడ విడిచిపెట్టకూడదు. క్రీస్తుకు నమ్మకముగా యుండుటకు ఎవరెన్ని మాటలు చెప్పినా మనం నిరుత్సాహపడ కూడదు.

నీ విశ్వాసము ఎంత గొప్పది? నీవు గొప్ప విశ్వాసము గలవాడవు కాగలవు. ఎన్ని అభ్యంతరములు కలిగినా, నీవు విశ్వాసములో బలవంతుడవగుదువు గాక! (2 థెస్స 1:3).

**– జెర్రీ బేట్స్**

# క్రీస్తు సంఘము - నిత్య రాజ్యము

## (The Lord's Church - The Eternal Kingdom)

***- Leonard Dunn***

పరలోక రాజ్యము, దేవుని రాజ్యమై యున్న క్రీస్తు సంఘమును గూర్చి నేడు, అనేక అపోహలున్నాయి. క్రీస్తు యొక్క రెండవ రాకడకు ముందు భూమి మీద నున్న సంఘము పరలోకరాజ్యమై యున్నదని కొందరు బోధిస్తారు.

క్రీస్తు మరల వచ్చినప్పుడు ఆయన పిలుచుకొను పరిశుద్ధులు పరలోక రాజ్యమని కొందరు బోధిస్తారు. సంఘము అనే పదాన్ని కొందరు తాము కూడుకొను భవనాన్ని గూర్చి చెబుతారు. మరికొందరు తమ డినామినేషన్‌నే సంఘమని పిలుస్తారు. ఉదా: పెంతెకొస్తు సంఘము, బాప్టిస్టు సంఘము మొదలైనవి. ఈ అంశముపై పరిశుద్ధ గ్రంథము ఏమి చెప్పుచున్నదో జాగ్రత్తగా పరిశీలించుదము (1థెస్స 5:2). క్రైస్తవులమైన మనము క్రొత్త నిబంధన సంఘము, రాజ్యము ఒక్కటేయని నమ్ముదుము. అది క్రీస్తు యొక్కయు అపొస్తులల యొక్కయు పరిచర్య వలన ఆరంభించబడి నిత్యము కొనసాగింప బడునని నమ్ముదుము.

యెషయా 55:9 ఇట్లు చెప్పుచున్నది: "ఆకాశములు భూమికిపైన ఎంత యెత్తుగా ఉన్నవో మీ మార్గముల కంటే నా మార్గములు, మీ తలంపులు కంటే నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి". దేవుడు మానవుని సృజించారు. మానవ మేధస్సు యొక్క సామర్థ్యాన్ని ఆయన యెరిగియున్నారు. అందువలన ఆయన పరిశుద్ధాత్మావేశము గల మనుష్యులచే మనుష్యుల భాషలో గ్రంథమును లిఖించి యిచ్చారు. దాని వలన, మానవులందరు దేవుని వాక్యాన్ని చిత్తాన్ని తెలిసికోగలరు. మానవుడు అర్థము చేసికోలేని రక్షణ సంకల్పము కొరకు దేవుడు తన ఏకైక కుమారుని బలి ఇచ్చేయడు. దేవుడు గందరగోళమునకు కర్త కాడని బైబిలు బోధించుచున్నది. (1 కొరింథీ 14:33). అయితే నేడింత గందరగోళం ఎందుకు వున్నది? ఒక మనుష్యుడు తన స్వకీయ ఆలోచనలను, సిద్ధాంతాలను బోధించుట కారంభించితే ఒక అబద్ధ బోధ ఆరంభ మౌతాది. క్రీస్తు సంఘ ఆరంభ దినాల నుండీ అబద్ధ బోధకులున్నారు.

వెయ్యేండ్ల పాలన యనుననది ఈ లోక వ్యాప్తమైన అబద్ధ బోధలలో ఒకటి. అది రెండవ శతాబ్దపు ఆరంభములోనే తలెత్తెను. మృతుల పునరుత్థానము

తరువాత భూమిపై రాజ్యము స్థాపించ బడునని ఆ బోధ యొక్క సారాంశము. ఆదిమ సంఘ చరిత్రకారులగు యుసాబియస్, డయోనిసియస్ అనువారును, తదితరులను సెరింతస్ అనువాడు ఈ అబద్ధ బోధకు కర్తయని వ్రాసారు. అతడు దుష్టుడు, దుర్మార్గుడు. భక్తుడైన యోహానుతో పెరిగిన యువక చరిత్రకారుడగు పోలికార్పు కూడ సెరింతస్ అనువాడు సత్యవిరోధియని చెప్పాడు. నిజానికి నేడు ఈ వెయ్యేండ్ల పాలన యను అబద్ధ సిద్ధాంతాన్ని నమ్మేవారు చెడ్డవారు కాదు. వారు మన మిత్రులు, బంధువులు కూడ. అయితే వారు నమ్మిన ప్రజలు వారికి చాల కాలము నుండి దానిని బోధించారు. దానినే సత్యమని వారు అంగీకరించారు. అయితే బెరెయలోని వారి వలె మనము వినుచున్న సంగతులు "అలాగున్నవో లేదోయని ప్రతి దినము లేఖనములను పరిశోధించాలి" (అపో.కా. 17:10,11).

రాబోవు రాజ్యమును గూర్చి క్రొత్త నిబంధన బోధకులు పలుమార్లు బోధించిరి. బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి "పరలోక రాజ్యము సమీపించి యున్నది యని బోధించాడు" (మత్తయి 3:1). "పరలోక రాజ్యము సమీపించి యున్నదని ప్రకటించుడి" యని యేసు తన శిష్యుల కాజ్ఞాపించారు (మత్త 10:7). మత్తయి 16:18,19లో సంఘము, రాజ్యము అను పదములు ఒకే దానిని సూచించుటకు ఉపయోగింప బడెను.

రాబోవు రాజ్యము లేక సంఘమును గూర్చి ప్రవక్తలు యేమి వ్రాసారో ఇప్పుడు గమనించుదాం. సంఘమును వర్ణించుటకు గాను పర్వతము అను పదము తరుచు పాత నిబంధనలో వినియోగింపబడెనని గుర్తించుకొనుము. "అంత్యదినములలో పర్వతముల పైన యోహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా యెత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలువెళ్లును. జనులు గుంపులు గుంపులుగా వచ్చి యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్లుదము రండి, ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలలో నడుతము అని చెప్పుకొందురు" (యెషయా 2:2-3). "దేవుని మందిరమే జీవముగల దేవుని సంఘమని" 1తిమోతి 3,15లో పౌలు తెలియజేసాడు. మరల ప్రవక్తయైన దానియేలు ఇట్లు చెప్పాడు : "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు, అది ముందు

చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును'' (దానియేలు 2:44). ఇక్కడ చెప్పబడిన రాజుల కాలము రోమా సామ్రాజ్యము. క్రీస్తు సంఘము లేక రాజ్యము స్థాపించ బడిన కాలములో వారు ఏలుబడి చేసిరి.

హెబ్రీ పత్రిక లేఖకుడు దానియేలు ప్రవచన నెరవేర్పును గూర్చి చెబుతూ, తానును, తన సహోదరులను ఆ రాజ్యములో యున్నారని తెలియజేసాడు. ''అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప కలిగియుందము, ఆ కృప కలిగి వినయ భయ భక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియైయున్నాడు" (హెబ్రీ 12:29). అపొ.పౌలు కొలస్స 1:13,14 లో ఇట్లు వ్రాసాడు : "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసుల నుగా చేసెను. ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాప క్షమాపణ కలుగుచున్నది". "ఒకడు తన ఊహను బట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయునగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగ పలికిరి'' యని పేతురు చెప్పాడు (2 పేతురు 1:21).

మత్తయి 16:19లో యేసు పేతురుతో "పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను. నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోక మందును బంధింపబడును, భూలోక మందు దేని విప్పుదువో అది పరలోక మందును విప్పబడును. భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడును" అని చెప్పెను. సంఘములో యున్నవారే రాజ్యములో యున్నవారని ఈ మాటల వలన యేసు తెలియజేసారు. పేతురుకు యేసు రాజ్యపు తాళపు చెవులు ఇస్తానని బహువచనాన్ని వినియోగించుట గమనించుము. ఏదైనా బంధింపబడిన దానిని విప్పుటకు సూచనగా 'తాళపు చెవులు' బైబిలులో వినియోగింపబడెను.

ఇప్పుడు అపొ.కార్యములు రెండవ అధ్యాయమునకు వెళ్లుదము, అక్కడ సంఘము లేక రాజ్యము యొక్క ఆరంభాన్ని కనుగొంటాము. క్రైస్తవులం దరికీ యిది ప్రాముఖ్యమైన అధ్యాయము. అందులో యెషయా, దానియేలుల ప్రవచనముల నెరవేర్పు మనకు కనబడ్తాది. వారిద్దరు ప్రవచించిన కాలములోనే, స్థలములోనే ఆ నెరవేర్పు సంభవించెను. 36–38 వచనాలలో ''మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశ

మంతయు రూఢిగా తెలిసికొనవలెనని (పేతురు) చెప్పెను. వారు యీ మాట విని హృదయములో నొచ్చుకొని, సహోదరులారా మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడిగిరి. అందుకు పేతురు – మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మయను వరమును పొందుదురు" అని చెప్పెను (అపొ.కా. 2–36: 38). "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి" (41వ).

ఇక్కడ పేతురు తన మొదటి తాళపు చెవిని వినియోగించాడు. మరల 2 పేతురు 1:5–11లో అతడిట్లు చెప్పాడు: "ఆ హేతువు చేతనే మీ మట్టుకు మీరు పూర్ణ జాగ్రత్తగలవారై మీ విశ్వాసమునందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనము నందు భక్తిని, భక్తి యందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమ యందు దయను అమర్చుకొనుడి, అవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చిన అనుభవ జ్ఞాన విషయములో మిమ్మును సోమరులై నను నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేకపోవునో వాడు తన పూర్వ పాపములకు శుద్ధి కలిగిన సంగతి మరచిపోయి గ్రుడ్డివాడును, దూరదృష్టి లేనివాడునగును. అందువలన సహోదరులారా, మీ పిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్త పడుడి. మీరిట్టి క్రియలు చేయువారైతే ఎప్పుడును తొట్రిల్లరు. ఆలాగున మన ప్రభువును రక్షకుడైన యేసు క్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును". పేతురు మొదటి తాళపు చెవిని వినియోగించి రక్షింపబడుట కేమి చేయాలో తెలియజేసాడు. రెండవ తాళపు చెవిని వినియోగించి రక్షింపబడి యెట్లు కొనసాగాలో తెలియజేసాడు.

చివరిగా పేతురు ఇట్లు ముగించు చున్నాడు. "ప్రియులారా, మీరు ఈ సంగతులు ముందుగా తెలిసికొని యున్నారు గనుక మీరు నీతివిరోధుల తప్పు బోధ వలన తొలగింపబడి, మీకు కలిగిన స్థిర మనస్సును విడిచి పడిపోకుండ కాచుకొని యుండుడి. మన ప్రభువును రక్షకుడైనైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృప యందును, జ్ఞానమందును అభివృద్ధి పొందుడి. ఆయనకు ఇప్పుడును యుగాంత దినము వరకును మహిమ కలుగును గాక, ఆమేన్" (2 పేతురు 3:17,18).

**– లెనోర్డ్ డన్**

# విగ్రహారాధన, పురాతనం, ఆధునికం

## (Idolatry, Ancient and Modern)

*- Ronald Bryant*



ప్రతి మానవుని హృదయం విగ్రహారాధనకు నిలయమని గమనించుట భయంకరమైనది!

అంతరంగిక ఆత్మీయ తలంపుల సమ్మేళనం ఒక విగ్రహమని చెప్పవచ్చును. పురాతన కాలంలోను, ఆధునికముగాను కూడ దేవుని నుండి తొలగిపోయి ఆయనకు బదులుగా వేరొక దానిని కౌగలించుట విగ్రహారాధనయే. నిజానికి విగ్రహములు ప్రకృతి అతీతములని ఎన్నడు తలంచరు. అవి విగ్రహములని కూడ తలంచరు. కొందరు రాశిఫలములను బట్టియు, జ్యోతిష్యమును బట్టియు తమ జీవితమును గడుపుదురు. మరికొందరు తమ శరీరములనే విగ్రహములుగా చేసికొనియున్నారు. యిది సహజసిద్ధముగా మీదబడుచున్న వయస్సును కాదనుచు నిత్య యౌవ్వనులుగా యుండాలనుకోవడం విగ్రహారాధనయే. అయినను ధనము, శక్తి, విలాసములు ఆధునిక విగ్రహములై నేడున్నవి.

దేవుని స్థానంలో ప్రజలు విగ్రహముల నెందుకు ఎంచుకొనుచున్నారు? ముఖ్య కారణం యేమంటే వారు దేవునికి బాధ్యులుగా ఉండుటకు నిరాకరిస్తారు. మనము దేవునికి లెక్క అప్పగించవలసిన వారము. మన షరతులను బట్టి దేవుని కలసికొనలేము గాని ఒక విగ్రహాన్ని మన షరతులను బట్టి కలసికొనగలము. ఎందువలననగా విగ్రహము మనము సృష్టించుకొన్నదే. గనుక అది సంపూర్తిగా మన ఆధీనములో యుంటాది. మన యిష్టము వచ్చిన చోట దానిని పెట్టుకోవచ్చు. దాని స్థానమును పదే పదే మార్చుకోవచ్చును! మనం విగ్రహములను మలుచుకోవచ్చును! దేవుని మనం

మల్చలేము. యెహోవా సెలవిచ్చున దేమనగా – “అన్యజనముల ఆచారముల నభ్యసింపకుడి. ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును. అయితే మీరు వాటికి భయపడకుడి. జనముల ఆచారములు వ్యర్థములు. అడవిలో ఒకడు చెట్లు నరుకునట్లు అవి నరకబడును. అది పనివాడు గొడ్డలితో చేసిన పని. వెండి బంగారముల చేతిపని వారు దానిని అలంకరింతురు. అది కదలకయుండునట్లు మేకులు పెట్టి సుత్తెలతో విరుగగొట్టి దాని నిలుపుదురు. అవి తాటిచెట్టు వలె తిన్నగా యున్నవి. అవి పలుకవు, నడువ నేరవు గనుక వాటిని మోయవలసి వచ్చెను. వాటికి భయపడకుడి. అవి హాని చేయనేరవు. మేలు చేయుట వాటి వలన కాదు” (యిర్మీయా 10:2-5).

తమ ఉనికికే కేంద్రముగా యుండాలనుకొనే వారికి విగ్రహములు పనిముట్లు. తమ గమ్యమును తామే నిర్ణయించువారు సత్యముతో ముఖాముఖిగా రాకుండటకు విగ్రహములు సాధనములు. వారు దేవుని, ఆయన చిత్తమును ఎదుర్కొన జాలరు. విగ్రహపూజ చేయువారు తమ్మును తామే ఎదుర్కొందురు. విగ్రహారాధనలో యున్న ఆకర్షణ అది.

## పర్యవసానము

అయినను విగ్రహారాధన యొక్క పర్యవసానములున్నవి. విగ్రహారాధన చేయువారు విగ్రహము వలె నిర్జీవముగా తయారవుదురు. వారు గొప్ప దృష్టి కలిగిన వారమనుకొందురు గాని వారు అంధులు. దేవుని కాదనినందున వారు తమ అధోగతిని కొలత వేయలేరు. తమ మనస్సాక్షికి విరోధముగా ప్రవర్తింతురు. తాము అపరాధులమని వారు నిరాకరిస్తారు. వారి అపరాధము గాని, ఎరుక గాని నిరాకరిస్తారు. నిజానికి వారి అపరాధము నిర్మూలించబడదు. తగ్గించ బడదు. అయితే వారి అపరాధము నాశనమును జరిగించు ఆగ్రహముగాను, హానికరక్రియలు గాను బయలుపడును.

విగ్రహారాధన అమాయక చర్య కాదు. సరదా కాదు. దాని అన్ని అవతారముల లోను దేవుని యెడల దాని వ్యతిరేకతను వ్యక్తపరచును. అందువలననే లౌకిక జ్ఞానము నిశ్చయముగా విగ్రహారాధనయే. అందువలననే బైబిలు దీని విషయమై తీవ్ర హెచ్చరిక చేయుచున్నది : “వ్యభిచారిణులారా యీ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును” (యాకోబు 4:4).

– రోనాల్డ్ బ్రాయన్ట్



# విశ్రాంతి దినము - క్రైస్తవులు
## (Sabbath Day & Christians)

***- Clem Thurman***



దేవుడు ఏడవ దినమందు విశ్రాంతి నొందెను గదా, మనమును విశ్రాంతి (సబ్బాతు) దినమును పాటించవలెనా? శనివారమున గాక ఆదివారమున సంఘ ఆరాధనలు ఎందుకు జరుపుదురు?

దేవుడు ఏడవ దినమందు విశ్రమించె ననునది వాస్తవమే. "దేవుడు తాను చేసిన తన పని యేడవ దినములోగా సంపూర్తి చేసి తాను చేసిన తన పని యంతటి నుండి యేడవ దినమున విశ్రమించెను" (ఆది.కా. 2:2). మరల "ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి యేడవ దినమున విశ్రమించెను. అందుచేత యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను" (నిర్గమ 20:11).

"మరియు దేవుడు ఏడవ దినమందు తన కార్యములన్నిటిని ముగించి విశ్రమించెను" (హెబ్రీ 4:4). "కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. ఎందుకనగా దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము ఆయన యొక్క విశ్రాంతిలో ప్రవేశించి వాడు

కూడ తన కార్యములను ముగించి విశ్రమించును. కాబట్టి అవిధేయత వలన వారు పడిపోయినట్లుగా మనలో ఎవడును పడిపోకుండ ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్తపడుదము" (హెబ్రీ 4:9-11). దేవుడు చేసిన పనియంతటిని గూర్చి ఆదికాండము మొదటి అధ్యాయములోను, నిర్గమ 20వ అధ్యాయములోను చెప్పబడియున్నది. ఆరు దినములలో భూమ్యాకాశములు, సమస్త సృష్టి జరిగించబడెను; విశ్వములో క్రమము, జీవము ప్రతిష్ఠింపబడెను. భూమి మానవ నివాసయోగ్యముగా చేయబడెను.

ప్రశ్న : దేవుడు తన పని యంతటి నుండి విశ్రమించెనా? లేక ఆయన సృష్టి 'పని' ఇంకా కొనసాగుచున్నదా? హెబ్రీ 4లో దేవుని ప్రజలకు నిలిచియున్నది విశ్రాంతి. అది విశ్రాంతి దినము కాదు. అది వారములో ఏడవ దినమును గూర్చి చెప్పబడలేదు. హెబ్రీ 4లో చెప్పబడిన దేవుని ప్రజలకున్న విశ్రాంతి పరలోకము. అక్కడ యేసు వున్నారు. "యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు వున్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము" (హెబ్రీ 4:14).

విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించవలెనని ఇశ్రాయేలీయులు మాత్రమే ఆజ్ఞాపింపబడిరి (నిర్గమ 20:11). ఐగుప్తు బానిసత్వము నుండి వారు విముక్తి నొందిన దానికి జ్ఞాపకార్థముగా అది వారికీయబడెను. "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినమును ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" అని మోషే ఇశ్రాయేలీయులకు హెచ్చరిక చేసెను (ద్వితీ 5:15). వారి కంటే ముందున్న తరములకు విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ ఇయ్యబడలేదని మోషే వారికి విశదపరచెను. అతడిట్లు చెప్పెను : "మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను. యెహోవా మన పితరులతో కాదు, నేడు ఇక్కడ సజీవులమైయున్న మనతోనే ఈ నిబంధన చేసెను" (ద్వితీ 5:2-3). అది ఇశ్రాయేలు జనాంగమున కీయబడెను. విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ అన్యులకెవ్వరికీ ఈయబడలేదు. అది ఇశ్రాయేలీయులకు మాత్రమే ఈయబడెను.

ఆదివారమున సంఘముగా ఎందుకు కూడుకొనాలి? దాని జవాబు సూక్ష్మంగా "అట్లు చేయమని ప్రభువే సెలవిచ్చారు!". ఎట్లు? మన ప్రభువు ఆదివారమున సమాధి నుండి తిరిగి లేచారు (మార్కు 16:1-6). సంఘము ఆదివారముననే స్థాపించబడెను (లేవీ 23:15-16, అపొ.

కా. 2:1-47). ఆదివారము అనగా వారములో మొదటి దినము! ఏడవ దినము కాదు. పరిశుద్ధాత్మచే నడిపించ బడుచున్న అపొస్తలుల మాదిరిని ఆదిమ సంఘము అనుకరించెను. పౌలు కూడ పరిశుద్ధాత్మ పూర్ణుడై ఆదివారమున సంఘారాధనలో పాల్గొనెను. "ఆదివార మున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్లనై యుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" (అపొ.కా. 20:7). ఆదివారమున వారు చందా పోగుచేయవలెనని హెచ్చరింప బడిరి (I కొరింథీ 16:2). అయితే ఆది వారము. సబ్బాతు (విశ్రాంతి) దినమని ప్రభువైన యేసు గాని, పరిశుద్ధాత్ముడు గాని, అపొస్తలులు గాని ఎన్నడు చెప్ప లేదు. ఆదివారము సబ్బాతు దినము కాదు. అది వారములో మొదటి దినము! ఏడవ దినము కాదు. ఇశ్రాయేలీయులకు వలె ఆదివారము క్రైస్తవులకు విశ్రాంతి దినము కాదు. అట్లని ఎక్కడా చెప్పబడ లేదు. మన విశ్రాంతి పరలోకము గాని వారములో ఏడవ దినము కాదు.

ఇశ్రాయేలీయుల కీయబడిన విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ ప్రకారము ఆ దినమందు ఎవ్విధమైన పని చేయకూడదు. ఇంకా అదొక్క నిషేధమే కాదు. ఇంటిలో అగ్ని రాచబెట్టకూడదు. ముప్పావు మైలు కంటే ఎక్కువ దూరము ఆ దినమందు ప్రయాణము చేయకూడదు. మోషే ఇశ్రాయేలీయుల సర్వ సమాజమును పోగు చేసి ఇట్లు ఆజ్ఞాపించెను : "మీరు ఆరు దినములు పని చేయవలెను, ఏడవది మీకు పరిశు ద్ధ దినము. అది యెహోవా విశ్రాంతి దినము. దానిలో పనిచేయు ప్రతివాడును మరణశిక్ష నొందును. విశ్రాంతి దినమున మీరు మీ యిండ్లలో అగ్ని రాజబెట్ట కూడదు" (నిర్గమ 35:2-3).

"అప్పుడు వారు (అపొస్తలులు) ఒలీవల వనబడిన కొండ నుండి యెరూషలేమునకు తిరిగి వెళ్లిరి. ఆ కొండ యెరూషలేమునకు విశ్రాంతి దినమున నడవదగినంత సమీపమున ఉన్నది" (అపొ.కా. 1:12). సబ్బాతును గూర్చిన ఆజ్ఞను అతిక్రమించువాడు చంపబడ వలెను (నిర్గమ 35:2). అది ఇశ్రాయేలులో జరిగించబడెను (సంఖ్యా 15:32-36). అట్టి ఆజ్ఞ ఇశ్రాయేలీ యులకే గాని అన్యజనులకు ఎన్నడు ఇయ్యబడలేదు. క్రొత్త నిబంధనలో అట్టి ఆజ్ఞ యేమీ లేనే లేదు. ఏదైనా ఒకరోజు విశ్రాంతి దినమని మనకు చెప్పబడలేదు. గనుక ఆ రోజులలో పనిచేసికొనుట తప్పు కాదు. క్రైస్తవుల కీయబడిన విశ్రాంతి సబ్బాతు దినము కాదు గాని అది పరలోకము! ఈ గొప్ప సత్యమును గ్రహించినప్పుడు విశ్రాంతికి, విశ్రాంతి దినముకు యున్న సందేహములు మటుమాయమగును!

**- క్లెమ్ తుర్మన్**

# నేడు మనము సబ్బాతును ఆచరించవలెనా?

## (Shall we Observe the Sabbath Today?)

***- Louis Rushmore***



బైబిలులో 66 పుస్తకములున్నవి. 40 మంది వివిధ లేఖకులు ఇంచుమించు 1600 సంవత్సరముల కాలములో అవి వ్రాయబడెను. పాత నిబంధనలో 39 పుస్తకములు క్రొత్త నిబంధనలో 27 పుస్తకములు వున్నవి. పాత నిబంధనలో దేవుడిచ్చిన రెండు రకములైన చట్టము లున్నవి. వాటిలో మొదటిది పితరుల కిచ్చిన చట్టము (మతము), రెండవది యూదులకిచ్చిన చట్టము (మతము). దేవుడిచ్చిన మూడవ చట్టము క్రొత్త నిబంధన. అది సర్వమానవాళికి వర్తించును.

గనుకనే అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మ ప్రేరణ వలన "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కర లేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనబడుటకు జాగ్రత్తపడుము" అని హెచ్చరించాడు (2 తిమో 2:15). దేవుని వాక్యాన్ని పఠించు విద్యార్థి పాత క్రొత్త నిబంధనల వ్యత్యాసాన్ని గ్రహించుకోవాలి. పితరుల యుగానికి, యూదుల యుగానికి, క్రైస్తవ్యానికి గల తేడాను తెలిసికోవాలి. అదే కుటుంబ మతము, జాతీయ మతము, అంతర్జాతీయ మతము

అను వాటిని నిగ్రహించుకోవాలి.

పాత నిబంధన క్రొత్త నిబంధనకు పునాదిగాను, ముందియ్యబడినదానిగాను యున్నను దాని స్థానముననే క్రొత్త నిబంధన ఇయ్యబడెనని లేఖనములు చెప్పుచున్నవి. యేసు ప్రభువు ధర్మశాస్త్రమును (పాత నిబంధనను) నాశనము చేయలేదు గాని, దానిని నెరవేర్చారు (మత్తయి 5:17). పాత చట్టమునకు బదులు క్రొత్త చట్టమునీయ వలెనని ఎల్లప్పుడు దేవుని కాంక్షయై యుండెను. పాత నిబంధన తీసివేయబడి దాని స్థానముననే క్రొత్త నిబంధన ఇయ్యబడుననే పాత నిబంధన ప్రవచన మును గమనించుము :

“ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారి పితరులతో చేసిన నిబంధన వంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను, యూదావారితోను చేయబోవు నిబంధన యిదే. వారి మనస్సులలో నా ధర్మ విధి ఉంచెదను. వారి హృదయముల మీద దాని వ్రాసెదను. యెహోవా వాక్కు యిదే. నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు జనులగుదురు. వారు మరి ఎన్నడును యెహోవాను గూర్చి బోధ నొందుదము అని తమ పొరుగువారికి గాని, తమ సహోదరులకు గాని ఉపదేశము చేయరు; నేను వారి దోషము లను క్షమించి వారి పాపములను ఇకనెన్నడు జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి, ఘనులేమి అందరు నన్నెరుగుదురు. ఇదే యెహోవా వాక్కు” (యిర్మీయా 31:31–34).

“ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవ దానికి అవకాశ ముండనేరదు. అయితే ఆయన ఆక్షేపించి వారితో ఈలాగు చెప్పుచున్నాడు. ప్రభువు ఇట్లనెను – ఇదిగో యొక కాలము వచ్చు చున్నది. అప్పటిలో ఇశ్రాయేలు ఇంటి వారితోను యూదా ఇంటివారితోను నేను క్రొత్త నిబంధన చేయుదును. అది నేను ఐగుప్తు దేశములో నుండి వీరి పితరులను వెలుపలికి రప్పించుటకై వారిని చెయ్యి పట్టుకొనిన దినమున వారితో నేను చేసిన నిబంధన వంటిది కాదు. ఏమనగా – వారు నా నిబంధనలో నిలువలేదు గనుక నేను వారిని అలక్ష్యము చేసితినని ప్రభువు చెప్పుచున్నారు. ఆ దినములైన తరువాత ఇశ్రాయేలు ఇంటివారితో నేను చేయబోవు నిబంధన యేదనగా, వారి మనస్సులో నా ధర్మ విధి ఉంచెదను. వారి హృదయ ముల మీద వాటిని వ్రాయుదును, నేను వారికి దేవుడనై యుందును, వారు నాకు ప్రజలై యుందురు. వారిలో ఎవడును

ప్రభువును తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను, తన సహోదరునికైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరు నన్ను తెలిసికొందురు. నేను వారి దోషముల విషయమై దయ గలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

"ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుట చేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిలి ఉడిగిపోవునో అది అదృశ్య మగుటకు సిద్ధముగా ఉన్నది" (హెబ్రీ 8:7–13).

తత్ఫలితముగా పాత ధర్మశాస్త్రమగు పాత నిబంధన స్థానములో క్రొత్త నిబంధన ఈయబడెను. పాత నిబంధన ఎత్తివేయబడెను (ఎఫెసీ 2:15). అది మేకులతో సిలువకు కొట్టబడి, దాని మీద చేవ్రాతను తుడిచివేయబడి, మనకు అడ్డము లేకుండా ఎత్తివేయుబడెను (కొలస్స 2:14). యేసుక్రీస్తు సిలువ వేయబడినప్పటి నుండి మానవజాతి "ధర్మశాస్త్రము నుండి విడుదల పొందెను" (రోమా 7:6). మానవజాతి ఇప్పుడు పాత నిబంధన వైపు, చివరకు పది యాజ్ఞల వైపు చూడనక్కరలేదు. ఒక చట్టము వలె అది ఏలుబడిలో లేదు. అది మనకు బోధ కలుగు నిమిత్తము ఒక చరిత్రాత్మక చట్టము వలె యున్నది (రోమా 15:4).

అయితే పాత నిబంధనలోని పది యాజ్ఞలలో తొమ్మిది అనగా సబ్బాతును గూర్చిన ఆజ్ఞ తప్ప, తొమ్మిది ఆజ్ఞలు ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని క్రొత్త నిబంధనలో ఇమడ్చబడియున్నవి. "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" (నిర్గమ 20:8) అను ఆజ్ఞ యొక్క స్థానములో ఆదివారమున ఆరాధించుటకు కూడుకొనవలెనని క్రొత్త నిబంధన మనకు నిర్దేశించుచున్నది (అపొ.కా. 20:7; I కొరింథీ 16:1–2). అది యేసు క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచిన దినము మరియు క్రీస్తు సంఘము ఆవిర్భవించిన దినము. గనుక క్రైస్తవులు శనివారమున గాక, వారములో మొదటి దినమున అనగా ఆదివారమున దేవుని ఆరాధించుటకు కూడుకొందురు.

సబ్బాతు నాచరించుటలో ఆరాధన కంటే ఇంకా ఎంతో ఎక్కువ ఇమిడి యుండెను. ఉదాహరణకు ఆ దినమున ఏ పని చేయకూడదు. ప్రయాణం వగయిరా చేయకూడదు. మరియు జంతు బలుల నర్పింపవలెను. క్రైస్తవుడయిన వాడెవడును నేడు సబ్బాతును ఆచరింపడు, ఆచరింపలేడు, పాత నిబంధనలోని ఏ భాగమైనను ఆచరింప గోరువాడు. "క్రీస్తు నుండి వేరేచేయబడిన వాడు మరియు కృపలో నుండి తొలగి పోయినవాడు" (కొలస్స 3:4).

**– లూయిస్ రష్మోర్**

# మనమందరము పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందుదుమా?
# (Do we all Receive the Baptism of the Holy Spirit?)

*- J.C.Choate*

ప్రభువు నందు నమ్ముకొన్న వారందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందుదురని/ పొందవలెనని అనేకులు భావిస్తారు. దానిని పొందిన తరువాత అపొస్తలుల వలె అద్భుతములు చేయడానికి వారు శక్తి పొందుదురని వారనుకొంటారు. అపొ.కా. 1:15లో 120 మంది విశ్వాసులు, అపొ.కా. 2:1-4లో 12 మంది అపొస్తలులు పరిశుద్ధాత్మను పొందారు గనుక వారి వలె నేడును మనము పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందుదుమని వారు నమ్ముతారు; ఇతరులను నమ్మిస్తారు. గనుక దయచేసి దిగువ ప్రశ్న జవాబులను గమనించండి.

## ప్రభువు ఆదరణకర్తను ఎవరికి వాగ్దానము చేసారు?

**జవాబు :** అపొస్తలులకు యేసు ఇట్లు చెప్పారు : "తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రి యొద్ద నుండి బయలుదేరు సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును. వారు మొదటి నుండి నా యొద్ద ఉన్న వారు గనుక మీరును సాక్ష్యమిత్తురు" (యోహాను 15:26-27). మరల ఆయన పరమునకు ఆరోహణము కాక మునుపు యేసు అపొస్తలులతో : "ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపు చున్నాను; మీరు పై నుండి శక్తి పొందు వరకు పట్టణములో నిలిచియుండుడని" చెప్పెను (లూకా 24:49). అపొ.కా. 1:8 ని కూడ చదువండి.

## అపొ.కా. 1వ అధ్యాయములోని 120 మంది పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరా?

**జవాబు :** అపొ.కార్యముల గ్రంథములో మొదటి రెండు అధ్యాయములను చదువు చుండగా, అపొస్తలులే కేంద్ర బిందువుగా మనకు కనబడుదురు. మన చేతిలో యున్న బైబిలు ఆదిలో అధ్యాయములు గను, వచనములుగను విభజింపబడ లేదు. యూదా స్థానమును భర్తీ చేయు టకు ఎంపిక చేయబడిన మత్తీయను గూర్చి చెబుతూ అపొ.కా. 1:26 ఇట్లనుచున్నది : "అంతట వారు వీరిని గూర్చి చీట్లు వేయగా మత్తీయ పేరట చీటి వచ్చెను గనుక అతడు పదునొకండు మంది అపొస్తలులతో కూడ లెక్కింప బడెను. పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒక చోట

కూడియుండిరి. అందరు పరిశుద్ధాత్మతో నింపబడినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో మాటలాడసాగిరి (అపొ.కా. 2:1-4).

ఈ సందర్భమును చూచి వారి మాటలను వినిన వారందరు మిక్కిలి కలవరపడిరి. "ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా?" యని విస్మయమొందిరి (7వ). అక్కడ కూడి యున్న 120 మంది కూడ గలిలయులు కారు. గాని అపొస్తలులందరు గలిలయులే. వారికే పరిశుద్ధాత్మ వాగ్దానము చేయబడెను. ఆ 12 మందే పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిరి. అందువలననే "పేతురు ఆ పదునొకరితో కూడ లేచి బిగ్గరగా" వారికి మొట్టమొదటి సువార్త ప్రసంగము చేసెను (14వ).

### అపొ.కా. 2:38లో వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ అను వరము, పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఒక్కటే కాదా?

**జవాబు :** కాదు. అది "దేవుడు తనకు విధేయులైన వారికి అనుగ్రహించిన పరిశుద్ధాత్మ" (అపొ.కా. 5:32). లేఖనార్థ మైన బాప్తిస్మము పొందిన ప్రతి వానికి అనుగ్రహించబడిన వరము పరిశుద్ధాత్మ. ఆ యాత్మ ద్వారా అతడు పరిశుద్ధాత్మ ఫలములను కనబరచును (గలతీ 5:22).

పెంతెకొస్తు దినమున విశ్వాసులందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందారని, తత్ఫలితముగా వారు అద్భుతములు చేయగలిగిరని కొందరు చెబుతారు. అట్లయితే అపొ.కా. 6:3-6లో అపొస్తలుల ఏడుగురు శిష్యులపై చేతులుంచి అద్భుతశక్తిని వారు పొందునట్లు ఏల చేయవలసి వచ్చినది?

**జవాబు :** నిజానికి అపొస్తలులు మాత్రమే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొంది యుండిరి. మిగతావారందరు నీటిలో బాప్తిస్మమును, పాపక్షమాపణను మరియు తమలో నివసించు పరిశుద్ధాత్మ వరమును పొందియుండిరి. అందువలన అపొస్తలులు మాత్రమే అద్భుతములు చేసే శక్తిని కలిగియుండిరి. అపొ.కా. 1:15లో యున్న 120 మందికిగాని, పెంతెకొస్తు నాడున్న 3000 మంది గాని (2:41) పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొంది యుండలేదు.

అయినను అపొ.కా. 6:1-8లో అపొస్తలులు పరిచర్య నిమిత్తము మంచి పేరు పొందిన ఆత్మతోను, జ్ఞానముతోను నిండుకొనియున్న ఏడుగురు మనుష్యు లను ఏర్పరచిరి. అపొ.కా. 2:38లో వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ వరమును ఈ మనుష్యులు అప్పటికే పొందియుండిరనునది విశదమే. అది అనాద్భుత పరిశుద్ధాత్మ వరము. గాని వారు అద్భుతశక్తి యేమీ పొందలేదు. అయితే వీరు ప్రత్యేకింపబడినప్పుడు అపొస్తలులు వారి మీద తమ చేతులుం చగా అద్భుతములు చేయు శక్తిని పొంది యుండిరి (అపొ.కా. 6:8; 8:5-6).

## క్రీస్తు నందలి విశ్వాసులు నేడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందుదురా?

**జవాబు :** లేదు. ఏలయనగా ఆ ప్రత్యేక బాప్తిస్మము అపొస్తలులకు మాత్రమే వాగ్దానము చేయబడెను. వారికే ఇయ్యబడెను. మరియు అన్యజనాంగములో నుండి వచ్చిన కొర్నేలీ యింటివారికిని అది అనుగ్రహించబడెను (అపో.కా. 10). ఈ రెండు సందర్భములు తప్ప పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారి మరియే సందర్భము లేఖనములలో మనకు కనబడదు. అపొస్తలులు తాము ఏర్పరచుకొనిన వారి మీద చేతులుంచి పరిశుద్ధాత్మ ద్వారా అద్భుతములు చేసే శక్తిని వారికి యిచ్చే వారు గాని యిలాగ పొందినవారు ఆ శక్తిని ఇంకొకరికి అనుగ్రహించుటకు వారికి శక్తి లేదు (అపో.కా. 6:6; 8:14-17). "ప్రజల మధ్య అనేకమైన సూచక క్రియలును మహత్కార్యములును అపొస్తలుల చేత చేయబడుచుండెను" (అపో.కా. 5:12). "అంతకు ముందు వారిలో ఎవని మీదను ఆయన దిగియుండలేదు. వారు (అపొస్తలులు) వచ్చి వారు పరిశుద్ధాత్మ పొందవలెనని వారి కొరకు ప్రార్థన చేసిరి" (అపో.కా. 8:15-16).

దీనిని బట్టి పరిశుద్ధాత్ముడు అద్భుత రీతిగా పనిచేసే కాలము మొదటి శతాబ్దముకే పరిమితము చేయబడినది. అది సంఘము యొక్క బాల్యదశ మరియు లేఖనములు వ్రాయబడుచు పరిశుద్ధాత్మ యొుక్క అద్భుత క్రియల వలన స్థిరపరచబడుచుయున్న కాలము (మార్కు 16:20).

## నేడు ప్రజలు బాప్తిస్మము పొందినప్పుడు యేమి పొందుదురు?

**జవాబు :** మనం ప్రభువుకు లోబడినప్పుడు పరిశుద్ధాత్మయను వరమును పొందుదుము. దేవుని ఆత్మ మనలో నివసించుచు మనకు ఆత్మీయ జీవము ననుగ్రహించును. దానిలో అద్భుత శక్తి యేమీ లేదు (అపో.కా. 2:38; రోమా 8:9-11).

అద్భుతశక్తిని నేడు మనం ఎందుకు పొందము? లేఖనములు మనకు స్థిరపరచబడి యున్నందున అద్భుతములు ఇంక అవుసరము లేదు. అందువలన పొందము (మార్కు 16:20; యోహాను 20:30-31). మరియు దేవుని వాక్యము వినుట వలన విశ్వాసము కలుగును, అద్భుతముల ద్వారా కాదు (రోమా 10:7). దేవతార్చన చేయు మతములన్నియు అద్భుతములు చేయు శక్తి తమకున్నందంటారు. అయితే అంత కంటే శ్రేష్టమైన వాక్యము మనకున్నది. దేవుని సంపూర్ణ నియమమైన క్రొత్త నిబంధన నేడు మనకున్నది. దాని ద్వారా దేవుని యొద్దకు చేరుదము (I కొరింథీ 12:31; 13:8-10).

**- జె.సి.ఛోట్**

# అన్యభాషల ప్రయోజనము

## (The Purpose of Tongues)

***- Roger Dickson***



మొదటి శతాబ్దపు సంఘమునకు దేవుడు విదేశీ భాషలను మాట్లాడే పరిశుద్ధాత్మ వరాన్ని అనుగ్రహించారు. ఆ భాష వారు యిదివరలో నేర్చుకొన్నట్టిది కాదు. వేరే భాష గనుక అన్య భాషయని చెప్పబడినది. గాని ఆ భాషను ఎరిగిన వారున్నట్లయితే వారికది అర్ధమయ్యే భాష. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన అపొస్తలులందరు అన్యభాషలతో మాట్లాడసాగిరి. గాని జనసమూహములో యున్న "ప్రతి మనుష్యుడు తన స్వభాషతో వారు మాటలాడుట విని కలవరపడిరి". "ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా? మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు భాషతో వీరు మాటలాడుట మనము వినుచున్నామే; ....... వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములు వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి" (అపొ.కా. 2:5-12).

మొదటి శతాబ్ధపు సంఘమునకను గ్రహింపబడిన అన్యభాషల వరమునకు మూడు ప్రయోజనములు కలవు. ఆ ప్రయోజనములు నెరవేరగానే అద్భుతరీతిగా అన్యభాషలలో మాటలాడే వరము నిలిచిపోయెను.

### అన్యభాషలు ఒక సూచక క్రియ :

విదేశీ (అన్య) భాషలతో మాటలాడుట పరిశుద్ధాత్ముడు అనుగ్రహించిన అద్భుత వరము. నమ్మినవారి వలన సూచక

క్రియలు కనబడునని యేసు తన అపొస్తలులకు వాగ్ధానము చేసారు (మార్కు 16:17). ఆదిమ శిష్యులు "బయలుదేరి వాక్యమంతటా ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి వెను వెంట జరుగుచు వచ్చిన సూచకక్రియల వలన వాక్యమును స్థిరపరచుచుండెను" (మార్కు 16:20). "దేవుడు తన చిత్తాను సారముగా సూచక క్రియల చేతను, మహాత్కార్యములచేతను, నానా విధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుట చేతను వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారిచేత (వాక్యము) మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:4).

క్రైస్తవ్యము దేవుని వలన కలిగినదని యితరులు నమ్ముటకు అన్యభాషలు మొదలైన యితర అద్భుత వరములు సూచనగా ఇయ్యబడెను. ఒకడు యిది వరలో ఎన్నడు నేర్చుకొనని వేరే భాషలో మాట్లాడునప్పుడది అవిశ్వాసులకు ఒక సూచనగా యుండాలని దేవుడు కోరెను. "కాబట్టి భాషలు విశ్వాసులకు కాదు, అవిశ్వాసులకే సూచకమైయున్నది" (1 కొరింథీ 14:22). దేవుడు సంఘములో అద్భుతరీతిగా పనిచేయుచున్నారని తెలియజేయుటకు అన్యభాషలు బహిరంగ ప్రదర్శనయై యుండెను. అవిశ్వాసులు తామెరిగిన మిత్రులు మున్నెన్నడు నేర్చు కొనని ఇంకొక భాషతో మాటలాడుట చూచారు. అందువలన విశ్వాసులైన వారితో దేవుడున్నాడని నిరూపించుటకు అవిశ్వాసులకు భాషలు ఒక సూచనయై యుండెను.

## క్షేమాభివృద్ధి కలుగజేయుటకు భాషలు ఇయ్యబడెను :

"భాషతో మాటలాడువాడు తనకే క్షేమాభివృద్ధి కలుగజేసికొనును" (1 కొరింథీ 14:4). ఒకడు వేరే భాషతో మాట్లాడుచుండగా దాని భావార్ధము (అనువాదము) చెప్పువాడు లేని యెడల, భాష మాటలాడువాడే క్షేమాభివృద్ధి నొందును. భావార్ధము చెప్పువాడు లేని సందర్భాన్ని గూర్చి 1 కొరింథీ 14:4లో చెప్పబడెను. అట్టి సందర్భాల్లో భాషతో మాటలాడువాడు మౌనముగా యుండా లని పౌలు హెచ్చరించాడు, ఏలయనగా ఒకడు అన్యభాషతో మాట్లాడితే తనకు క్షేమాభివృద్ధి కలుగజేసికొనునుగాని, కూడి వచ్చిన వారికతడు ఇబ్బంది కలుగ జేయును. అయితే తర్జుమాదారుడు న్నట్లయితే సంఘమంతా ఉపదేశము (క్షేమాభివృద్ధి) పొందును.

## సువార్త వ్యాప్తి కొరకు భాషలు ఉపయోగపడెను :

ఆదిమ క్రీస్తు సంఘాల్లో వివిధ భాషల వారుండుటయే గాక, వారు సర్వలోకానికి వెళ్లి సర్వ జనాంగములకు సువార్త ప్రకటించాలని ఆజ్ఞాపింపబడిరి (మత్త 28:19-20). ఏదైనా కొత్త ప్రాంతపు

భాషలో బోధించాలన్నా, ఉపదేశించాలన్నా ఆ ప్రాంత భాష నేర్చుకొనుటకు 6 నెలల నుండి ఒక సంవత్సరకాలము పట్టును. ఏ ప్రాంతము వెళ్లినా పౌలు అక్కడ అంతకాలం వుండి ఆ భాష నేర్చుకొనుటకు అతనికి వీలుపడిందా? అట్టి సమయం అతను వెచ్చించగలడా? "నేను మీ యందరి కంటె ఎక్కువగా భాషతో మాటలాడుచున్నాను; అందుకు దేవుని స్తుతించుచున్నానని" అతడు వ్రాసాడు (1 కొరింథీ 14:18).

పరిశుద్ధాత్మ వలన అతడు నేర్చుకొనని అనేక భాషలతో మాటలాడే వరాన్ని పౌలు పొందాడు. అట్టి అద్భుత వరము వలన అతడును, మిగతా సువార్తికులును మొదటి శతాబ్దములోనే ప్రపంచమంతా సువార్త చాటుటకు వీలు పడింది. యేసు వారికాజ్ఞాపించిన దానిని నెరవేర్చు నిమిత్తము వారు సర్వలోకానికి వెళ్లిరి. ఆకాశము క్రిందనున్న సమస్త సృష్టికి అన్యభాషల వరము వలన వారు సువార్త ప్రకటింపగలిగిరి (కొల్స 1:23).

## అన్యభాషలు నిలిచిపోయెను :

దేవుని వాక్యమును స్థిరపరచుటకు గాను మొదటి శతాబ్దములో ఇయ్యబడిన అద్భుత వరములు, అన్యభాషలతో సహా అన్నియును నిలిచిపోయెనని క్రొత్త నిబంధన బోధించుచున్నది. ఆదిమ క్రైస్తవులను విశ్వాసములో బలపరచుటకును, వాక్యమును స్థిరపరచుటకును విదేశీ భాషలు మాటలాడే అద్భుతవరము వారికనుగ్రహించబడెను (మార్కు 16:17 –20; హెబ్రీ 2:3,4; ఎఫెసీ 4:11,16). అపొస్తలులు వలన ఆదిమ శిష్యుల వలన ప్రకటింపబడిన వాక్యము పరిశుద్ధాత్మ శక్తి వలన స్థిరపరచబడెను (అపొ.కా. 20:30; 1 కొరింథీ 4:19,20; 1 థెస్స 1:5). పౌలు ప్రకటించినది, సువార్తికులు, ప్రవక్తలు ప్రవచించినది కూడ అద్భుతముల వలన దృఢపరచబడెను (రోమా 15:18–19). అయితే క్రొత్త నిబంధన గ్రంథము లిఖితపూర్వకముగా ముగించబడినప్పుడు అద్భుత వరములన్ని నిలిచిపోయాయి.

అద్భుతముల ద్వారా విశ్వాసాన్ని స్థిరపరచవలసిన అవుసరం ఈనాడు యేమీ లేదు. మొదటి శతాబ్దపు అనేక అద్భుతములు అందుకొరకు క్రొత్త నిబంధనలో రికార్డు చేయబడి వున్నాయి (యోహాను 20:30,31). అద్భుతముల ద్వారా స్థిరపరచబడిన వాక్యము యొక్క రికార్డు క్రొత్త నిబంధన నేడు మనకున్నది. యేసు యొక్క అనేక అద్భుతములను యోహాను రికార్డు చేసాడు. అన్ని యుగాలలో యున్న జనులందరికీ విశ్వాసము కలుగజేయుటకు ఆ రికార్డు చాలని అతడు వక్కాణించాడు (యోహాను 20:30,31). అందువలన అన్యభాషల వరము లేకుండా నేడు యేసు నందు జనులు విశ్వాసముంచగలరు. తన గ్రంథములో ఏమైతే రికార్డు చేయబడిందో

అది మనలను ప్రతి సత్కార్యము చేయుటకు పరిపూర్ణమైయున్నదని దేవుడు చెబుతున్నారు (2 తిమోతి 3:17).

అద్భుత రీతిగా కలుగు వాక్య బయల్పాటు ఆపుచేయబడునని దేవుడు జెకర్యా ప్రవక్త ద్వారా తెలియజేసారు (జెకర్యా 13:2-5). అదెప్పుడు జరుగునో జెకర్యా చెప్పలేదుగాని ఆగిపోవునని మాత్రం తెలియజేసాడు. 1 కొరింథీ 13:8-10లో ఈ అద్భుత వరములు నిలిచిపోవును. నిరర్ధకములగును, ఆగిపోవునని పౌలు తెలియజేసాడు. ఎఫెసీ 4లో కూడ అతడట్లు బోధించాడు.

విశ్వాసము సంపూర్తిగా బయలుపరచ బడు వరకు అద్భుత వరములుంటాయని పౌలు ఎఫెసీ 4లో చెప్పాడు. "అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులననుగ్రహించెను" అని వ్రాయబడి యున్నది (ఎఫెసీ 4:9). యేసు పరలోకమునకారోహణమైనప్పుడు ఆయన మనుష్యులకు అద్భుత వరముల నిచ్చెను. "ఈ వరము పరిశుద్ధులు సంపూర్ణులగునట్లు క్రీస్తు శరీరము క్షేమాభివృద్ధి జెందుటకు ఇయ్యబడెను (ఎఫెసీ 4:12). "మనమందరము విశ్వాస విషయములోను, జ్ఞాన విషయములోను ఏకత్వము పొంది సంపూర్ణ పురుషులమగు వరకు ఆయన ఈలాగు నియమించెను'' (11వ). ఇంకొక మాటలో సంఘమునకు విశ్వాసము వాక్యము సంపూర్ణముగా బయల్పడు వరకు ఈ అద్భుత వరములు నియమించబడెను. ఈ విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే (Once for all) అప్పగింపబడెనని యూదా వ్రాసాడు (యూదా 3; రోమా 10:8; కొల 3:7). అందువలన అన్యభాషలతో మాటలాడుటతో సహా, అద్భుత వరములన్నీ ఆగిపోయాయి. దేవుని బయల్పాటు అంతా మొదటి శతాబ్దములోనే సంపూర్తి ఆయెను. సత్య వాక్యము సంపూర్తిగా క్రొత్త నిబంధనలో రికార్డు చేయబడెను. గనుక అద్భుతములు ఆగిపోయాయి. భాషలు కూడ నిలిచిపోయాయి.

– రోజర్ డిక్సన్


**మేము ఇచ్చు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. 26 పాఠముల కోర్సును పూర్తిచేసి ఒక బైబిలును బహుమతిగా పొందండి.**

**మాకు ఫోన్ చేయండి లేదా ఉత్తరం వ్రాయండి.**

**సత్యవాణి**

**పోస్ట్ బాక్స్ నెం. 80,**

**కాకినాడ – 533001**

0884-23637222, 98489 98547

# ప్రభువు దినాన్ని నీవు ఎట్లు పరిగణించుచున్నావు?

## (Treatment of the Lord's Day)

***- Raymond Kelcy***

**ఇదొక చిన్న కథ :**

బాలుడొకడు మంచి రైతు యొక్క మామిడితోటకు వెళ్ళి ఆ తోటలోని పండ్లను గూర్చి ఆశపడుచు దానిని చూస్తూయున్నాడు. ఆ తోటలో బాగుగా పండిన మధురమైన పండ్లను అతడు చూస్తూయుండగా ఆ తోట యజమాని బాలుని కండ్లలో ఆశను చూచి, వానిని ప్రేమించి ఆ చెట్టుకున్న ఆరు పండ్లను కోసి వానికిచ్చాడు. ఆ బాలుడు వాటిని తీసికొని వెంటనే వెళ్లిపోయాడు గాని యజమానికి కృతజ్ఞత చెప్పలేదు. గాని అతడు మరలా వచ్చి ఆ చెట్టుకున్న ఏడవ పండును కూడ కోసికొని, దొంగిలించి వెళ్లిపోయాడు.

ఈ బాలుడస్సలు మంచివాడు కాదు, మంచిపని చేయలేదని మనం అనుకొంటాము. అతడా యజమానికి కనీసము కృతజ్ఞత చెప్పలేదు, సరిగదా ఏడవ పండును కూడ దొంగిలించాడు. అయితే వేలకొలది, లక్షలకొలది స్త్రీ, పురుషులు నేడు చేయుచున్న పని యిదే! వారు దేవుడిచ్చిన ఆరు దినములను తమ స్వార్థ ప్రయోజనాల కొరకు వాడుకొంటారు. ప్రభువుకు కనీసం కృతజ్ఞత కూడ చెల్లించరు. సరిగదా ప్రభువు దినము వచ్చేసరికి దేవుని నారాధించుట మాని, దానిని కూడ తమ కొరకే వాడుకొంటారు.

"ఆ రోజు ఒక్కటే మాకు సెలవు". "నేను చాల అలసిపోయాను, ఆ రోజుననే నేను కొంత విశ్రాంతి తీసికొంటాను" అని వారు నానావిధ సాకులు చెబుతారు.

అయితే ప్రభువు దినము ప్రభువుది. మనది కాదు. మనకున్న రోజు అదొక్కటే కాదు. ఆలోచనాపరులైన ప్రజలు ఎందుకు అంత స్వార్థపరులవుతారు? ప్రజలు ఆ రోజంతా నిద్రపోతారు. టి.వి. చూస్తూయుంటారు. ఆటలాడతారు. గాని దేవుని ప్రజలతో కూడి ఆరాధన చేయుటకు రారు! ఎందువలన? వారు ప్రభువు దినమును దొంగిలించుట లేదా? "కొందరు మానుకొనుచున్నట్టుగా మీరు సమాజముగా కూడుట మానవద్దు" (హెబ్రీ 10:25).

**- రేమండ్ కెల్సీ**



# ఈ మార్గమును గూర్చి బోధించుట

## (Preaching the Way)

***- E. Claude Gardner***

అపొస్తలుల కార్యములలో క్రీస్తు సంఘాన్ని గూర్చి చెబుతు దానిని "ఈ మార్గము" అని లూకా కనీసం 6 సార్లు వివరించాడు. పౌలు తన మతమును గూర్చి చెబుతు, "వారు మత భేదమని పేరు పెట్టు ఈ మార్గము చొప్పున నా పితరుల దేవుని సేవించుచున్నానని" పలికాడు (అపొ.కా. 24:15).

### ఈ మార్గమనగా యేమిటి?

ఈ మార్గము ఒక క్రైస్తవ విధానము. అది సత్యారాధన జరిగించు మార్గము. అది జీవన మార్గము. క్రైస్తవ్యము ఒక జీవన విధానము, రక్షణ మార్గము, సేవా మార్గము, నిరీక్షణ మార్గము. ఈ మార్గము ద్వారానే మనం జీవితాన్ని అనుభవిస్తాము. దీని ద్వారానే రాబోవు లోకంలో నిత్యము జీవిస్తాము (I పేతురు 3:10-12; యోహాను 10:10; లూకా 19:10; I యోహాను 2:25).

### ఈ మార్గమును బోధించుట అనగానేమి?

ఒకడు ఈ మార్గమును గూర్చి బోధించునపుడతడు క్రీస్తును ఆయన సువార్తను బోధిస్తాడు. మనము ఈ మార్గమును గూర్చి బోధించునపుడు దిగువ సంగతులను బోధిస్తాము.

**క్రీస్తును గూర్చి బోధిస్తాము :** ఫిలిప్పు సమరయులకు, నపుంసకునికి క్రీస్తును గూర్చి బోధించాడు (అపొ.కా. 8:5,12, 35). మన రక్షణయైన క్రీస్తే మన ముఖ్య ధ్యేయము (అపొ.కా. 2:22; యోహాను 14:6). మనం మనలను గూర్చి గాని, మన అభిప్రాయములను గాని, సంశయములను గాని, వ్యక్తిగత కోరికలను గాని బోధించరాదు (I కొరింథీ 2:2; 2 కొరింథీ 4:5).

**మనము క్రీస్తు సంఘాన్ని గూర్చి బోధిస్తాము :** సమరయలో ఫిలిప్పు క్రీస్తును గూర్చియు, "దేవుని రాజ్యమును" గూర్చియు బోధించాడు (అపొ.కా. 8:12). సంఘము యొక్క తత్వమును, విలువను బోధించకుండా ఈ మార్గమును గూర్చి బోధించలేము. క్రీస్తు నుండి ఆయన సంఘమును విడదీయ లేము (అపొ.కా. 26:23,31; ఎఫెసీ 5:32).

**మనము సువార్తను బోధిస్తాము :** "సర్వ లోకమునకు, సర్వ సృష్టికి సువార్త బోధించాలని యేసు మనలనాజ్ఞాపించారు (మార్కు 16:15; I కొరింథీ

9:16). పౌలు బహు విద్యావంతుడు. అయినను అతడు సువార్తను బోధించాడు (గలతీ 1:11,12). క్రీస్తు శుభవార్తతో లోకమును దీవించుట మన భాగ్యము.

**మనము సత్యమును బోధిస్తాము :** సత్యము, మార్గము అను మాటలలో క్రైస్తవ్యమంతా సంగ్రహముగా ఇమిడి యున్నది. మనము "ప్రేమ గలిగి సత్యమును చెప్పాలి" (ఎఫెసీ 4:15). సత్యము మనలను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32; I పేతురు 1:22).

**మనము వాక్యమును ప్రకటింతుము :** వాక్యమును ప్రకటించుము అని పౌలు ఆజ్ఞాపించాడు. దైవోక్తులను బోధించు నట్లు బోధించాలి అని పేతురు చెప్పాడు (2 తిమోతి 4:2; 2:2; I పేతురు 4:11). ఆజ్ఞాపింపబడుట యనగా విజ్ఞాపన కాదు. మన స్వాభిప్రాయములను బోధించరాదు.

**మనము దేవుని బోధను బోధిస్తాము :** నీనెవకు వ్యతిరేకముగా బోధించుమని యెహోవా యోనాకు చెప్పినప్పుడు, "నీవు లేచి నీనెవె మహాపురమునకు పోయి నేను నీకు తెలియజేయు సమాచారము దానికి ప్రకటింపుము" అని చెప్పారు (యోనా 3:2). దేవుని నుండి కలిగిన దానికి మనం కలుపకుండా, తీసివేయకుండా, నిష్పక్షపాతముగా బోధించాలి (అపొ.కా. 20:26; గలతీ 1:8-9); 2 యోహాను:9).

**ఈ మార్గము నంగీకరించువారిని హెచ్చరించాలి :** మనము జ్ఞానుల వలె నడుచుకోవాలి (ఎఫెసీ 5:15). జీవమునకు పోవు మార్గములో ప్రవేశించి ఒకడు దానిలో కొనసాగాలి (మత్తయి 7:14). క్రైస్తవునిగా యుండుట అనగా పరిశుద్ధ మార్గములో నడుచుకొనుటయని మనమెరగాలి (యెషయా 35:8). మనము నిత్యము పురాతన మార్గములలో నడుచుకోవాలి (యిర్మియా 6:16).

మనము ప్రభువు మార్గములో నడుచు నప్పుడు అది నీతిమార్గమైయుండును (కీర్తన 23:3). అది ప్రేమమార్గమై యుండును (యోహాను 4:19). విశ్వాస మార్గమైయుండును (హెబ్రీ 11:6). పరిచర్య చేయు మార్గమైయుండును (మత్తయి 23:11,12).

**- యి. క్లాడ్ గార్డ్నర్**



# నీవు మాదిరికరమైన క్రైస్తవుడవా?

# (Are you A Faithful Christian Example?)

*- Mark N. Posey*



ఒకని మాదిరి చాల ప్రభావము గలది. మాదిరిని బట్టి మనం నేర్చుకొంటాము, వింటాము, జీవిస్తాము. కొన్ని ఉదాహరణలు గమనించుము. అబ్రాహాము గొప్ప విశ్వాసము గలవాడు (రోమా 4:20). క్షమించుటలో యోసేపు చాల గొప్పవాడు (ఆది.కా. 50:20). మోషే గొప్ప నాయకుడు (నిర్గమ 14). దావీదు గొప్ప ధైర్యశాలి (I సమూయేలు 17). మరియు యేసు మనకు పరిపూర్ణ మాదిరియై యున్నారు (2 కొరింథీ 5:21). I తిమోతి 4:12-16 నుండి ప్రభావవంతమైన ఏడు క్రైస్తవ గుణములను గమనించుము.

**1) మాదిరికరమైన క్రైస్తవ నైతికత** (12వ): మన మాటలు, ప్రవర్తన, ప్రేమ, స్వభావము, విశ్వాసము మన తలంపుల లోను, మాటలలోను, క్రియలోను కనుబరచవలెను. మన జీవితంతోనే మనం గొప్ప ప్రసంగమును చేయుచు న్నాము (I కొరింథీ 4:16; 11:1; ఫిలిప్పీ 3:17; 4:9).

**2) బైబిలు పునాది** (13వ) : "మాదిరిగా యుండుము". ఇప్పుడు, ఎప్పుడు, ఎల్లవేళలా మాదిరిగా యుండాలి. అంటే వాక్యమునకు ఎల్లవేళలా కట్టుబడి యుండాలి.

**3) దేవుడు అనుగ్రహించిన వరమును ఉపయోగించాలి** (14వ) : పెద్దల హస్త నిక్షేపణము వలన తిమోతి అద్భుత వరమును పొందియున్నాడు. మొదటి శతాబ్దములోపే అద్భుత వరములన్నీ ఆగిపోయాయి (1 కొరింథీ 13:8–12). గనుక వాడుక ద్వారా దైవకటాక్షము వలన పొందిన సామర్థ్యమును ఉపయోగించాలి. దేవుడు మనకిచ్చిన తలాంతులను వినియోగించాలి. తలాంతులను గూర్చిన ఉపమానము బోధించుచున్నది. మన తలాంతులను పాతిపెట్టకూడదు. దేవుడిచ్చిన దానిని ఆయన మహిమ కొరకు వినియోగించు దాము (I కొరింథీ 10:31).

**4. నీ అభివృద్ధి కనబడు జీవితమై యుండాలి** (15వ) : పవిత్రమైన జీవితం జీవించుటకు సంపూర్ణముగా సమర్పించు కోవాలి. పౌలు తన జీవిత ధ్యేయమును గూర్చి తేటగా ఎరిగియున్నాడు. "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" అని చెప్పాడు (ఫిలిప్పీ 1:21; గలతీ 2:20).

**5) నీ వెలుగు ప్రకాశించాలి** (15వ) : క్రైస్తవ్యము నిర్జీవమైనది కాదు గాని సమర్పించుకొనిన జీవితం. క్రైస్తవులు బలముగా నిలబడాలి, ప్రకాశవంతముగా ప్రజ్వరిల్లాలి, నమ్మకముగా జీవించాలి. యితరులు చూచి అనుకరించునట్లు మన జీవితం పవిత్రత కలిగినదై యుండాలి (I పేతురు 1:13–16).

**6) సమర్పించుకొనిన పట్టుదల** (16వ): మన జీవితంలో మనలను గూర్చి, లేఖనములను గూర్చి సహనము కలిగి యుండాలి. సహనమును బట్టి మనం శక్తివంతులమవుదుము (హెబ్రీ 10:32–37).

**7) తేటగా యున్న గమ్యము** (16వ) : రక్షణ మన గొప్ప అవుసరము. మనకు మనమే పరీక్షించుకొనాలి, నిత్యత్వమును గూర్చి ఆలోచించుము, సహించుచు యుంటే మన ధ్యేయము సరియైనదే. "క్రైస్తవ్యమును బట్టి ఈ లోకము క్రైస్తవులను గమనించుచున్నదని" మనం గుర్తుంచుకోవాలి.

**– మార్క్ పోసీ**

# రెండు ప్రాముఖ్యమైన ప్రశ్నలు
# (A Pair of Questions)

*- Dennis Gulledge*



**1) పాత నిబంధనలో పాపక్షమాపణ యున్నదా? లేనిచో హానోకు పరలోకమున కెట్లు కొనిపోబడ్డాడు?**

బైబిలు ఇట్లు చెప్పుచున్నది : "ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృప చేతనే క్రీస్తు యేసు నందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమి వలన ఉపేక్షించినందున ఆయన తన నీతిని కనుబరచవలెనని క్రీస్తు యేసు రక్తము నందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను" (రోమా 3:23-26).

ఇక్కడ కరుణాధారము అనగా పాప క్షమాపణయని అర్ధము. ఈ మాట క్రొత్త నిబంధనలో తరుచు వాడబడలేదు. నిజానికి క్రొత్త నిబంధనలో ఇక్కడ మాత్రమే ఆ పదము వాడబడెను. క్షమాపణ అని దాని అర్ధము కాదు గాని, "పాపములను పంపివేయుట" యని

అర్ధము. ఇంకొక మాటలో ముందుగనే పాపములను పరిహరించుట యని గ్రహించుకోగలము (రోమా 3:26). గనుక పాత నిబంధన కాలములో పరిపూర్ణ పాపక్షమాపణ లేదు. హెబ్రీ 9:15; 10:4 చదువుము.

హానోకు విషయానికి వచ్చేసరికి అతడు పరలోకమునకు కొనిపోబడెనని బైబిలు ఎక్కడా చెప్పుట లేదు. సరిగదా, "హానోకు దేవునితో నడచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేకపోయెను'' అని అది చెప్పుచున్నది (ఆది.కా. 5:24). మరియు "విశ్వాసమును బట్టి హానోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను" అని హెబ్రీ 11:5లో చెప్పబడినది.

**2. లూకా 22:35-38లో యేసు క్రీస్తు తన శిష్యులను కత్తులు కొనుక్కొన వలెనని, రెండు కత్తులు చాలునని ఎందుకు చెప్పారు?**

నిజానికి ఆ లేఖన భాగమును మనము జాగ్రత్తగా పరిశీలిస్తే రెండు కత్తులు కొనుక్కొనవలెనని తన శిష్యులకు యేసు క్రీస్తు చెప్పలేదు. 38వ వచనములో "ప్రభువా ఇక్కడ రెండు కత్తులున్నవని శిష్యులు ఆయనతో చెప్పారు. మనకు తెలిసినంత వరకు ఆ మేడ గదిలో అప్పటికే రెండు కత్తులుండి యుండెను.

పరిస్థితులు మారబోవుచున్నావని యేసు వారికి చెప్పుచున్నారు. మత్తయి 10వ అధ్యాయములో యేసు శిష్యులకు ''పరిమితి గల ఆజ్ఞలు'' యిచ్చి పంపినప్పుడు వారు తమతో డబ్బును గాని, మిగతా వస్తువులను గాని తమతో తీసికొనక దేవుని కాపుదలపై ఆధారపడ వలెనని ఆయన ఉద్దేశ్యము. అయితే ఆయన పునరుత్థానుడైన తరువాత పరిస్థితులు వేరుగా యుండును. వారికి రక్షణ (Protection) అవుసరము. అవుసరమైతే వారు తమ బట్టలను అమ్ముకొని కత్తి కొనుక్కొనుట అవుసరం. తన శిష్యులు కత్తులు కొనుక్కోవాలని యేసు ఆజ్ఞాపించలేదు. గాని వారు తమ పనిలో లోకజ్ఞానము వినియోగించు కోవాలని బోధించారు.

పై లేఖన భాగంతో మనకు వచ్చే సమస్య యేమంటే "యేసు నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు. ఈ లోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఈ లోక సంబంధమైనది కాదనెను" (యోహాను 18:36). తన రాజ్య (సంఘ) పరిరక్షణ కొరకు శిష్యులు మత సంబంధ యుద్ధము చేయుటకు యేసు అనుమతి ఇయ్యలేదు. అయితే శిష్యులు తమ్మును తాము పరిరక్షించుకొనకూడదని ఆయన ఎన్నడు చెప్పలేదు!

**- డెన్నిస్ గుల్లెడ్జ్**

# "ఇంతకు ముందు గాని, ఇప్పుడు గాని...."

## (Neither in the Past nor Since....)

*- John Gipson*



అయ్యో మోషే ! ఇబ్బందిలో పడ్డాడు! తనకు వల్ల కాని పని చేయుమని దేవుడతని ఆజ్ఞాపించుచున్నారు! ఆయన మాట విన్న తరువాత, "మోషే – ప్రభువా

ఇంతకుమునుపైనను నీవు నీ దాసునితో మాటలాడినప్పటి నుండి యైనను నేను మాట నేర్పరిని కాను, నేను నోటి మాంద్యము, నాలుక మాంద్యము గల వాడనని యెహోవాతో చెప్పెను" (నిర్గమ 4:10). ఇంకొక మాటలో ప్రభువా నేను కాదు, ఇంకొకరిని పంపుము అన్నట్లున్నది.

ఒక్క క్షణంలోనే దేవుడు మోషే యొక్క నోటి మాంద్యము, నాలుక మాంద్యము తీసివేసి మోషే చెప్పిన సాకును కొట్టివేయగలరు. గాని ఆయన అట్లు చేయలేదు. అతని బలహీనతతోనే ఆయన మోషేను తిరిగి ఐగుప్తుకు పంపారు!

అపొ.పౌలు కూడ తన శరీరములో యున్న బలహీనతనెరిగి దానిని తొలగించుకుని ప్రభువును వేడుకొన్నాడు. యిది వింతగా కనబడును గాని "నీ బలహీనత యందు నా శక్తి పరిపూర్ణమగు చున్నది" యని ప్రభు అతనికి చెప్పారు. ఆ మాట విని అపొ.పౌలు "కాగా క్రీస్తు శక్తి నా మీద నిలిచియుండు నిమిత్తము విశేషముగా నా బలహీనతల యందే బహు సంతోషముగా అతిశయపడుదును. నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను గనుక క్రీస్తు నిమిత్తము నాకు కలిగిన బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, హింసలలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నానని" అతడు చెప్పాడు (2 కొరింథీ 12:9-10). పౌలు తన శారీరక బలమును గూర్చి చెప్పిన యెడల అతని జీవితంలో దేవుని శక్తి కనబడకపోవును.

నేను కూడ బహుశా మోషేతో కొంత పాలి భాగస్థుడను. నిర్దిష్టమైన క్రైస్తవ బాధ్యత నా యెదుట ఉంచబడియున్నది. దేవుడు నాకేదైనా పని అప్పగిస్తే దానిని నిర్వర్తించే సామర్థ్యము ఆయన నాకనుగ్రహించును అని తలస్తాను. గాని అనుగ్రహింపరు. నేను ఇంకా నేనే, ఆయన నన్ను వాడుకొనకముందు నా బలహీనతలను ఆయన నిర్మూలించనక్కర లేదు. నిజానికి దేవుని శక్తి నా బలహీనతల యందు బయలుపడు చున్నది!

మనం ఆత్మ విశ్వాసముతో సంపూర్తిగా నింపబడియుంటే మనలో దేవుని శక్తి లేనట్లే. "అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీ 4:7).

**- జాన్ గిప్సన్**



# దేనిని గూర్చి చింతపడకుడి
## (Be anxious in Nothing)

*- Wayne Barrier*

మనం చింతపడకుండా వుండాలన్నా మన దైనందిన జీవితం సమస్యలతోను, పరిస్థితులతోను నిండియున్నది. మనం వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ భద్రత, జాతీయ అంతర్జాతీయ భద్రత మొదలగువాటిని ఎదుర్కొనుచునేయున్నాము. ఈ అలజడులు, శోధనలు, బాధలు, రోగములను ఎదుర్కొనుచు క్రైస్తవులు ఎట్లు వాటితో సతమతమవ్వాలి? బైబిలు బోధనలను బట్టి నాలుగు సంగతులు మనం ఆలోచించాలి, నేర్చుకోవాలి.

**మొదటిగా మనం పొందిన ఆశీర్వాదములను లెక్కించుకోవాలి :** బహు క్లిష్ట పరిస్థితులలో యున్నను మనం పొందిన ఆశీర్వాదములను గమనించు కోగలము. మనకు ఆర్థిక సమస్యలుండ వచ్చును గాని మంచి ఆరోగ్యముతో యుండవచ్చును. స్వాతంత్ర్యము యితరుల వలన పొందే ప్రేమ, సహవాసములను లెక్కింపవచ్చును. సమస్త ఆత్మీయాశీర్వాదములు మనం అనుభవించుచున్నాము (ఎఫెసీ 1:3).

**రెండవదిగా, మనం ప్రార్థన చేయాలి:** అపో.పౌలు ఫిలిప్పీ 4:4-7లో ఇట్లు హెచ్చరించాడు : "ఎల్లప్పుడును ప్రభువు నందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి. మీ సహనమును సకల జనులకు తెలియబడనియ్యుడి. ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును, మీ తలంపులకును కావలియుండును" (ఫిలిప్పీ 4:4-7). మరల ప్రభువు ఇట్లు చెప్పారు : "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకు వానికి దొరుకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యునికైనను తన కుమారుడు తన్ను రొట్టెనడిగిన యెడల వానికి రాతి నిచ్చునా? చేపనడిగిన యెడల పాము నిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి ఈవుల నియ్య నెరిగియుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె

ఎంతో నిశ్చయముగా మంచి ఈవుల నిచ్చును" (మత్తయి 7:7-11).

జ్ఞానము కొరకు ప్రార్థించాలి (యాకోబు 1:5). అంతరంగిక బలము కొరకు (ఎఫెసీ 3:14-16) దైనందిన అవుసరముల కొరకు, క్షమాపణ కొరకు, అపవాది నుండి విడుదల కొరకు, నడిపింపు కొరకు మనం ప్రార్థించాలి (మత్తయి 6:14-16). రోగుల కొరకు, అంగహీనుల కొరకు, నిస్సహాయుల కొరకు ప్రార్థించాలి.

**మూడవదిగా అన్ని శక్తుల కన్నా తన బిడ్డల యెడల దేవునికున్న ప్రేమ గొప్పది అని గుర్తుంచుకోవాలి :** సమస్తమును దేవుని కంట్రోలులో యున్నదని, ఆయన మనలను కాపాడుచున్నాడని రోమా 8:28-29 బోధించుచున్నది. దేవుని ప్రేమించువారికి సమస్తమును సమకూడి జరుగుచున్నవి. దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరవైనను, వస్త్రహీనత యైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? అయినను మన లను ప్రేమించినవాని ద్వారా వీటన్నిటి విషయములో అత్యధిక విజయము పొందుచున్నాము (రోమా 8:29-36).

**చివరిగా ఇంకొకరి కొరకు నీవు ఏమైనా చెయ్యి :** యాకోబు 2:14-15, 17 ఇట్లు చెప్పుచున్నది : ‘‘నా సహోదరులారా క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పిన యెడల ఏమి ప్రయోనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరు డైనను, సహోదరియైనను దిగంబరులై ఆ నాటికి భోజనము లేకయున్నపుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక - సమాధానముగా వెళ్లుడి, చలి కాచుకొనుడి తృప్తి పొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? ఆలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును". రోగులకు అనాథలకు సహాయము చేయుము. జ్ఞాన వివేకము కలిగి ప్రవర్తించుము. మంచి జరిగించుటకు ప్రయత్నము చేయుము.

మనం అనుదిన సమస్యల నుండి తప్పించుకొనజాలము. బైబిలు జ్ఞానముతో వాటిని ఎదుర్కొనాలి. లేదా అపజయము నొందుదుము. విశ్వాసముతో సమస్యల నెదుర్కొనుటకు ప్రయత్నించుము. నా వల్ల కాదని బలహీనపడకుము. మేలు చేయుటకు ఒక శక్తిగా నుండుటకు ఎంచుకొనుము.

**- వేయిన్ బేరియర్**



# మనము ప్రభువును ఎంతగా ప్రేమించుచున్నాము?

## (How much do we Love the Lord?)

***- Wendell Winkler***



"వారు భోజనము చేసిన తరువాత యేసు సీయోను పేతురును చూచి – యోహాను కూమారుడవైన సీమోను, వీరి కంటే నీవు నన్ను ఎక్కువగా ప్రేమించు చున్నావా? అని అడుగగా అతడు – అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించు చున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను. యేసు – నా గొర్రె పిల్లలను మేపుమని అతనితో చెప్పెను" (యోహాను సువార్త 21:15).

## మనము మన బంధువుల కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే మనం సువార్తకు లోబడకుండా వారిని అడ్డుకో నివ్వము. వారు అంగీకరించిన మతము సరైనదికాదని నిరూపించబడినపుడు మనం ఇష్టపూర్వకముగా దానిని విడిచిపెట్టడానికి సిద్ధపడతాము. ప్రభువు సంఘము యొక్క కార్యక్రమములకు వెళ్ళకుండ వారిని అడ్డుకోనివ్వము. యేసు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "తండ్రినైనను, తల్లినైనను నా కంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు, కుమారునినైనను, కుమార్తెనైనను నా కంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు" (మత్తయి10:37).

## మనం ధనము కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, మనం జీవించడం కోసం ప్రధానమైనదిగా డబ్బును కుప్పలుగా వేయము. మనం ప్రభువుకు ఉదారముగా ఇచ్చెదము (2 కొరింథీ 8:1–5). ప్రభువు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "ధనాపేక్ష సమస్త కీడులకు మూలము" (I తిమోతి 6:10).

## మనము సుఖము కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, క్రీస్తుపై మన ప్రభావమును ఏది అడ్డగించునో, ఏది దెబ్బతీయునో దానిలో మనం నిమగ్నులమై యుండము. అపాయకర మైన కాలములలో ప్రభువు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "దేవుని కంటే సుఖానుభవము నెక్కువగా మనుష్యులు ప్రేమింతురు" (2 తిమోతి 3:1–4).

## మనము మనుష్యుల ప్రశంసల కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, ప్రభువు కొరకు మరియు సరైనదాని కొరకు మనం ఒంటరిగా అయినా సరే నిలువబడడానికి సిద్ధపడుదుము (2 తిమోతి 4:16,17). ''అయినను అధికారులలో కూడ అనేకులు ఆయన యందు విశ్వాస ముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదుమేమోయని పరిసయ్యు లకు భయపడి వారు ఒప్పుకొన లేదు. వారు దేవుని మెప్పు కంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించిరి'' (యోహాను 12:42,43).

ప్రభువు మన ప్రేమకు అత్యున్నతుడు (మత్తయి 22:37). మనం పాడుట నేర్చుకుందాం మరియు దాని అర్థమును తెలుసుకుందా. "More love to thee, O Christ, more love to thee" - "నిన్ను ఎక్కువగా ప్రేమించెదం ఓ క్రీస్తూ నిన్ను ఎక్కువగా ప్రేమించెదం".

**– వెండల్ విన్క్లెర్**

# సిలువ యేమి బయలుపరచుచున్నది?

## (What does the Cross Reveal?)

*- John Stacy*

హెబ్రీ 12:1-2లో పౌలు ఇట్లు వ్రాసాడు : ''ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘము వలె మనలను ఆవరించియున్నందున మనము కూడ ప్రతి భారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు మన ఎదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్య పెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆశీనుడైయున్నాడు". మన జీవితంలో సిలువ వైపు దృష్టించిన యెడల ఆ సిలువ నాలుగు ప్రాముఖ్య సంగతులను మనకు బయలుపరచు చున్నది.

**క్రీస్తు సిలువ పాపము యెడల దేవుని దృక్పధమును మనకు బయలుపరచు చున్నది :** పాపము ఒక అకస్మిక ఘటన యని మానవుడు అంటాడు, దేవుడు దానిని హేయమని పిలుస్తారు. పాపము ఒక పొరబాటు అని మానవుడు తలస్తాడు. దేవుడు దానిని అంధత్వమని యంటారు. పాపము తప్పిదమని మానవుడు అంటాడు, దేవుడు అది బుద్ధిపూర్వక చర్యయని అంటారు. "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము". గనుక దేవుడు పాపమును ద్వేషిస్తారు (I యోహాను 3:4). "దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును'' గనుక దేవుడు పాపమును అసహ్యించుకొంటారు (యాకోబు 1:15). క్రీస్తు సిలువ ద్వారా పాపమును నాశనము చేయుటయే దేవుని ప్రణాళికయైయున్నది. "అపవాది క్రియలను లయ పర్చుటకే దేవుని కుమారుడు ప్రత్యక్ష మాయెను" (I యోహాను 3:8).

**మానవుని తత్వమును క్రీస్తు సిలువ బయలుపరచుచున్నది :** సిలువ సందర్భములో మానవుడు తన భక్తియనే ముసుకును తీసివేసి, నరకాగ్నితో అతని ఆత్మ ఎంత నిండియున్నదో తన్ను తాను బయలుపరచుకొన్నాడు. "వారు అసూయ చేత ఆయనను అప్పగించిరని పిలాతు ఎరిగియుండెనని'' మత్తయి 27:18 చెప్పుచున్నది. ''అధిపతి ఎందుకు?

ఇతడు ఏ దుష్కార్యము చేసెనని అడుగగా వారు సిలువ వేయుమని మరి ఎక్కువగా కేకలు వేసిరి" (మత్తయి 27:23). క్రీస్తును సిలువ వేయించిన ప్రజలను గూర్చి చెబుతు "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టుల చేత సిలువ వేయించి చంపితిరి" యని పేతురు ఉద్ఘాటించాడు (అపో.కా. 2:23). "అందుకు ప్రజలందరు వాని రక్తము మా మీదను మా పిల్లల మీదను ఉండును గాక యని పలికిరి". ఈ మాటలు వారి ఘోర పాపతత్వమును బయలుపరచు చున్నవి (మత్తయి 27:25). సిలువ చుట్టు జరిగిన సందర్భములు మానవుని ఘోర స్థితిని దేవుని ఉచ్ఛ స్థితిని మనకు బయలు పరచుచున్నవి.

**క్రీస్తు సిలువ దేవుని ప్రేమను బయలు పరచుచున్నది :** అవును సిలువలో దేవుని ఔన్నత్యము మనకు కనబడుచున్నది. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమైయుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా 5:8). "అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి, మనము మన అపరాధముల చేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడ బ్రతికించెను" (ఎఫెసీ 2:4). దేవుని ప్రేమ నిత్యము వుండునట్టిది. "యెహోవా దయాళుడు, ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతర ముండును" (కీర్తన 138:1). అందుకే "దేవుడు ప్రేమయై యున్నాడు" అని I యోహాను 4:8 చెప్పుచున్నది.

**మానవుని నిరీక్షణ యదార్ధము కాగలదని క్రీస్తు సిలువ బయలుపరచు చున్నది :** తన పాపములు క్షమించ బడాలనే మానవుని నిరీక్షణ క్రీస్తు సిలువ వలన యదార్ధమగును. "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా మన అపరాధము లకు క్షమాపణ కలిగియున్నది" యని ఎఫెసీ 1:7 చెప్పు చున్నది. దేవునితో సమాధానపరచబడాలనే మానవుని నిరీక్షణ యదార్ధము కాగలదు. "ఆయన సిలువ రక్తము చేత సంధి చేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందు న్నవియైనను, పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచు కొనవలెననియు తండ్రి అభీష్టమాయెను" (కొలస్స 1:20). గనుక ఇప్పుడు మన "పౌరసత్వము పరలోక మందున్నది" (ఫిలిప్పీ 3:20).

**– జాన్ స్టేసీ**

# మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము
# (We Preach Christ, Crucified)

*- Rod Bryant*



సువార్తకు యేసుక్రీస్తు యొక్క సిలువ కేంద్రమైయున్నది. రక్షణ సంకల్ప మంతయు మానవ పాపపరిహారార్ధ బలిగా అర్పించబడిన క్రీస్తుపై ఆధారపడి యున్నది. అయినను మొదటి శతాబ్దములో సిలువను గూర్చిన వార్త కొందరికి అభ్యంతరముగా యుండెను. నాటి కాలమందున్న యూదులకు,

అన్యులకు కూడ సిలువ వేయబడిన క్రీస్తు అభ్యంతరముగా యుండెను.

సిలువ వేయబడిన మెస్సీయను గూర్చి బోధించితే యూదుల యొక్క దురభిమానమును రేకెత్తించుట యగును. మరియు తర్క వాదమునకు నాంది పలుకునట్లగును (అపొ.కా. 26:23). యూదులు విజేయుడైన మెస్సీయాను కోరుకొనిరి. ఆయన మహత్కార్యముల వలన దావీదు యొక్కయు, సొలొమోను యొక్కయు సింహాసనమును (రాజ్యమును) పునరుద్ధరించును. అయితే యేసు యొక్క సిలువ యూదునికి గొప్ప అభ్యంతరమాయెను. ఆయన భూ రాజ్యమును స్థాపించలేదు, సరిగదా సిలువపై మరణించెను. ఆయన మెస్సీయ కాదని వారు తలంచిరి. ఈ విషయంలో యూదుడు యేసును గూర్చి తెలిసికొనకముందు తన దురభిమానమును విడిచిపెట్టాలి. యూదులు సూచక క్రియల నడుగుచుండిరి. గాని ఆ సూచక క్రియలను అధిగమించి వారు తమ నేత్రములను తెరువవలసియుండెను (రోమా 1:3-4).

అన్యజనులు కూడ వారు క్రీస్తును గూర్చి నేర్చుకొనక ముందు కొన్ని సంగతులు మరువవలసిన వారైయుండిరి. ఏ క్రొత్త పద్ధతికైనా దాని యొక్క బాగోగులను అంచనా వేసికొనుటకు వారు సంసిద్ధులై యుండిరి. గాని క్రీస్తు నొద్దకు నడిపించుటకవుసరమైన పరిజ్ఞానము లేకుండిరి. యూదులు, అన్యజనులు కూడ దురభిమాన ద్వేషము వలన, సిలువ వేయబడిన క్రీస్తును అంగీకరించుటకు అభ్యంతరములను కలిగియుండిరి.

అయితే క్రీస్తును గూర్చిన ప్రకటన అందరి ఆశలను నెరవేర్చునట్టిది కాదు. యూదులను సంతోషపెట్టుటకు క్రీస్తును యుద్ధ జయశాలిగ ప్రకటించలేదు. అన్యజనులను సంతోషపెట్టుటకు ఆయనను వేదాంతశాలిగ ప్రకటించలేదు. గాని ఆయన సిలువ వేయబడిన క్రీస్తు అని ప్రకటింపబడెను.

సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుట మానవుని వలన కలిగినది కాదు. దేవుని యొక్క దివ్య సంకల్పము వలన సిలువలో మాత్రమే మానవుని రక్షణ, దేవుని శక్తి జ్ఞానము ఇమిడి యున్నది (I కొరింథీ 1:18-31; రోమా 1:16-17). రక్షింపబడుచున్నవారికి సిలువ వేయబడిన క్రీస్తు దేవుని శక్తియు, జ్ఞానమునై యున్నారు (కొరింథీ 1:18,31).

**- రాన్ బ్రాయన్ట్**



# ఏదైనా వస్తువు సంపద యెట్లగును?

## (What makes a Thing, a Treasure?)

***- Charles R. Rose***



నేను బాలునిగా యున్నప్పుడు నేను నా మిత్రులు ఏదైనా విలువైన ఖజానా దొరుకునేమోయని పలు చోట్ల వెదికే వారము. ఆ కాలములో, చిన్నతనములో మాకు చాల విలువైన వస్తువులు దొరికేవి. ఇప్పుడైతే అవి ఎందుకు పనికి రావు. గాని పిన్న వయస్సులో యున్న మాకు అవి ఎందుకు అంత విలువైన సంపదగా అగుపడెను?

మొదటిగా అది ఎక్కడ దొరికినదో చూడాలి. ఉదాహరణకు అది ఒక కాలువలోనో, నదిలోనో దొరికియుంటే, దాని కొరకు మేము ఈత ఈదుకొని ప్రయత్నించాలి. దొరికినదేదైనా మా యింటిలో యిది వరకే యున్నది కాదు. రెండవదిగా దాని విలువ యెట్టిది? దాని ఖరీదు ఎంత ఉండవచ్చును? అది అరుదుగా యుండే వస్తువా? చిన్న పిల్లలుగా మాకు దొరికిన వస్తువులకు (గులకరాళ్లు మొదలైనవి) మేము గొప్ప వెల కట్టే వాళ్లము. గాని పెద్దవారమైన తరువాత అవి పనికిరానివని తెలిసి పారవేసాము.

అయితే అన్నిటికంటే ప్రశస్తమైన సంపద దేవుని కుమారుడైన క్రీస్తు ద్వారా మన కనుగ్రహింపబడుచున్న రక్షణయే. “అయినను ఆ బలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటి ఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు” (2 కొరింథీ 4:7). ఏదైనా ఒక వస్తువు సంపద కావలెనంటే నాలుగు సంగతులు అవుసరము.

**ఆ సంపద దొరికిన చోటు :** యేసే దానికి ఆధారము. ఆయన యొద్దనే ఆ సంపద యున్నది. “దేవుని కృప వలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు

మరణము అనుభవించెను" (హెబ్రీ 2:9). "ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానముగా నుండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపము ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:6-7). ఆయన తానే తన శరీరమందు మన పాపములను భరించుట ద్వారా మన కొరకు సంపద సమకూర్చెను (I పేతురు 2:24). ఆయన మృతులలో నుండి లేచి తండ్రి యొద్దకు ఆరోహణుడై సువార్తయను ప్రశస్త సంపదను మనకనుగ్రహించెను. పాపులను రక్షించుటకు సువార్త దేవుని శక్తియైయున్నది (రోమా 1:16). అది మంటి ఘటములైన మనుష్యులచే ప్రకటింపబడాలి.

**ఆ సంపద యొక్క విలువ :** మంటి ఘటములైన మనలో యుంచబడిన ఐశ్వర్యవే మనదాయెను. దానిని సంపాదించుకొనిన వాని సంపద విలువ ఎంతో గొప్పది. "పిత్రు పారంపర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువుల చేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడి తిరని మీరెరుగుదురు" (I పేతురు 1: 18-19).

**అది అరుదైన సంపద :** అది అరుదైనది. దాని వంటిది ఇంకొకటి లేదు. మంటి ఘటములలో యున్న ఐశ్వర్యము ఎంత అరుదైనదంటే, "క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవర పెట్టువారు కొందరున్నారు" (గలతీ 1:7). అయినను ఈ ఐశ్వర్యము ఎంత అరుదైన దంటే, పరలోకము నుండి వచ్చిన దూతయైనను దానికి వేరైనది బోధింప కూడదు (గలతీ 1:8-9).

**ఆ సంపద యొక్క అవుసరము :** అందరూ పాపము చేసినందున (రోమా 3:23), పాపము వలన వచ్చు జీతము మరణమైనందున (రోమా 6:23), మంటి ఘటములైన వారిలో యున్న ఐశ్వర్యము, పాపులను రక్షించి పరమునకు చేర్చు శక్తి కలిగియున్నందున అది మానవులకు అత్యవుసరమైన వర్తమానము. ఈ వర్తమానము వినుట ద్వారా విశ్వాసము కలుగును (రోమా 10:17). గనుక ఈ వర్తమానము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). విశ్వాసము వలన ఒకడు మారుమనస్సు పొందుటకు దోహదపడును (అపో.కా. 17:30). క్రీస్తును ఒప్పుకొని (రోమా 10:9-10), పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందును (రోమా 6:3-6).

**నీవు ఈ సంపదను కనుగొన్నవా?**

**- చార్ల్స్ రోజ్**

# పరిసయ్యుల నుండి యేమి నేర్చుకొనగలము?
# (What can we learn from the Pharisees?)

*- Cecil May Jr.*



పరిసయ్యులు తమ కాలమందు చాల నిష్ఠ కలవారు. వారు బైబిలు నందు విశ్వాసముంచిరి. పరిసయ్యుడు అను పదమునకు పాపము నుండి అపవిత్రత నుండి వేరుచేయబడినవాడని అర్ధము. ధర్మశాస్త్రమును పాటించుటలో వారు నిష్ణాతులు మరియు పారంపర్యములను పాటించుటలో ఆసక్తి గలవారు.

అయినను సరే పలు విషయాలను గూర్చి యేసు వారిని గద్దించారు. వారనుసరించుదాని కంటే శ్రేష్ఠమైన మార్గమును గూర్చి అనేకులు చెప్పుకొనే వారు (మత్తయి 23:2-3). పరిసయ్యులు ఇతరులను నిశితముగా విమర్శించేవారు. గాని తమ్ముతాము నీతిమంతుల మనుకొనేవారు (మత్తయి 23:4). వారు మానవ పారంపర్యములు దేవుని వాక్యము కంటే శ్రేష్టమని తలంచుటయే గాక, యితరులపై వాటిని రుద్దేవారు. పారంపర్యములు దేవుని వాక్యముకు విరుద్ధముగా యున్నను సరే వాటిని గౌరవించేవారు (మత్తయి 15:1-9). యేసు వారిలో కొందరిని దోషులని తీర్చారు ఏలయనగా :

**వారు విధేయత చూపుచున్నవాని కంటే, వారి విధేయతనే నమ్ముకొనేవారు:** "తామే నీతిమంతులని నమ్ముకొని యితరులను తృణీకరించువారిని" గూర్చి యేసు ఒక ఉపమానము చెప్పెను (లూకా 18:11). పరిసయ్యుడు తనకు తానే

ప్రార్థించుకొనేవాడు (లూకా 18:11). తాను చేసిన పనులను గూర్చి దేవుని యొద్ద గొప్ప చెప్పుకొనేవాడు. ఉపవాస ముంటాడు, ప్రార్థిస్తాడు, యితరులకు సహాయమిస్తాడు. అతడు తన ప్రార్థనను బట్టి యేమీ పొందలేదు ఏలయనగా అతడు యేమీ అడుగలేదు. అతనికి యేమీ అవుసరం లేదని అతడు భావించాడు.

**వారి యిష్ట ప్రకారము ధర్మశాస్త్రమును కుదించేవారు :** ఉపవాసముండుట, ప్రార్థించుట, దానము చేయుట ప్రత్యేక మైనవి, కొలబద్ధమైనవి. కొలబద్ధమైన సంగతులను వారు బాగానే చేసేవారు. దశమ భాగములో వారు పుదీనాను, సోపును యిచ్చేవారు. వీటి విషయంలో వారు తప్పు చేయలేదు. యివి మీరు చేయవలసియుండెనని యేసు వారికి బోధించారు (మత్తయి 23:23).

**కఠినమైన సంగతులను వారు విడిచి పెట్టేసారు :** వారు న్యాయమును, కనికరమును, విశ్వాసమును విడిచి పెట్టారు (మత్తయి 23:23). వారు పారంపర్యములను పాటిస్తూ ప్రజలను మరిచారు.

వీటి విషయమై మనమును జాగ్రత్తగా యుండాలి. వారు చేసినట్లే మనమును చేసే ప్రమాదమున్నది. దేవుడనుగ్రహించే కృపకు బాప్తిస్మము ద్వారా మనము స్పందించవచ్చును. ప్రతి ఆదివారము ప్రభు రాత్రి భోజనమును, వాద్యములు లేకుండా పాటలు పాడుటను స్థానిక సంఘ ప్రభుత్వమును పాటించుట ద్వారా మనము దేవునికి విధేయత చూపగలము. వీటిని మీరు చేయవలసియున్నదియని యేసు చెప్పారు.

అయినను మనము వీటిని చేస్తు, కృప అవుసరము లేదని తలంచిన యెడల, ఈ పనులే మనలను పాపుల నుండి వేరుచేయునని తలంచిన యెడల ప్రాముఖ్యమైన వాటిని మనం జ్ఞాపకముంచుకోవాలి. యదార్ధముగా మనము కనికరము చూపుచున్నామా? తండ్రి లేని వారిని, విధవరాండ్రను మనం రక్షించుచున్నామా? అందరము మనకు చేతనైనంత సహాయం చేయుచున్నామా? ప్రతి సహోదరుని సమానముగా ఎంచు చున్నామా? ప్రేమింపబడని వారిని ప్రేమించుచున్నామా? మనలను అగౌరవ పరచు వారిని సయితము ప్రేమించు చున్నామా? మిగతా మతస్థులను కూడ మన పొరుగువారిగా చూచుచున్నామా?

ఇవన్నీ ఆలోచిస్తే బహుశ మనం మరింత నమ్మకముగా యుందుము, కనికరము కలిగియుందుము. చివరకు, "ప్రభువా పాపినైని నన్ను కరుణింపుము" అని ప్రార్థించుటకు ప్రోత్సహింప బడుదుము".

**– సీసెల్ మే**



# అపవాది సర్వజ్ఞానియా?

## (Is the Devil Omniscient?)

*- Clippard Hamilton*



అపవాది సర్వజ్ఞాని కాదు. సర్వజ్ఞాని కాజాలడు. I కొరింథీ 2:6-8 ఇట్లు చెప్పుచున్నది : "పరిపూర్ణులైనవారి మధ్య జ్ఞానము బోధించుచున్నాము. అది యీ

లోకజ్ఞానము కాదు. నిరర్థకులైపోవుచున్న యీ లోకాధికారుల జ్ఞానమును కాదు గాని దేవుని జ్ఞానము మర్మమైనట్లుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను. అది లోకాధికారులలో ఎవనికి తెలియదు. అది వారికి తెలిసి యుండిన యెడల మహిమా స్వరూపుడగు ప్రభువును సిలువ వేయుకపోయి యుందురు".

క్రీస్తును ద్వేషించి చంపించిన వారి వెనుకయున్న బలమైన శక్తి అపవాది యనుటలో సందేహము లేదు. ఆయనను గూర్చిన సత్యము వారికి తెలిసియుంటే క్రీస్తును సిలువ వేసి యుండకపోదురు అని పౌలు చెప్పుచున్నాడు. దీనిని ఒక క్షణము ఆలోచించుము – మానవులందరు రక్షింపబడే ఒకే ఒక్క విధానము క్రీస్తు యొక్క పాపపరిహారార్థ బలియే. మానవులందరి దరపున క్రీస్తు తన్ను తాను అప్పగించుకొన్నారు. అపవాదికి ఈ సంగతి తెలిసియుంటే, వాని శక్తినంతటిని వినియోగించి ఆయన సిలువ మరణమును ఆపు చేయించి యుండును.

హెబ్రీ 2:14-15ను కూడ గమనించుము : "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గల వారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గల వానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును, జీవిత కాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయన కూడ రక్త మాంసములలో పాలి వాడాయెను".

తన మరణ, సమాధి పునరుత్థానముల ద్వారా యేసు అపవాది యొక్క బలమును నాశనము చేసేసారు. అపవాది గనుక సర్వజ్ఞానియైతే ఈ సంగతిని ముందుగనే ఎరిగియుండేవాడు. మరియు ఆయన సిలువ వేయబడకుండా అడ్డుకొనేవాడు.

మరియు అపవాది సర్వజ్ఞానియైతే మనము దేవుని చెంత చేరకుండా శోధిస్తు యుండేవాడు. గతంలో వానికి యేది పని చేసెనో దానినే వాడు వినియోగిస్తాడు. గాని ఆ ప్రత్యేక శోధనను జయించుట యెట్లో మనమెరిగియున్న యెడల, వాడు మన యొద్ద నుండి పారిపోవును, ఇంకొక అస్త్రమును ప్రయోగించును. "కాబట్టి దేవునికి లోబడియుండుడి, అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:7-8).

**– క్లిప్పర్డ్ హేమిల్టన్**

# మరణము - నిత్యత్వము

## (Death and Eternity)

*- Royce Frederick*



మనుష్యుడు చనిపోయిన తరువాత యేమి జరుగును? సృష్టిలో ఆరవ దినమందు "దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది.కా. 2:6). జీవాత్మ శరీరమును విడిచిపోగా మరణము సంభవించును. అప్పుడు "మన్నయినది వెనుకటివలె మరల భూమికి చేరును, ఆత్మ దాని దయ చేసిన దేవుని యొద్దకు మరలపోవును" (ప్రసంగి 12:7). రాహేలు మృతి బొందినప్పుడు ఆమె "ప్రాణము పోవుచుండెనని" చెప్ప బడెను (ఆది.కా. 35:18). ప్రాణము లేని శరీరము మృతమని యాకోబు సింపుల్‌గా చెప్పెసాడు (యాకోబు 2:26).

### మరణానంతరము

మరణించిన తరువాత ప్రతివాని ఆత్మ ''పాతాళమునకు'' కొనిపోబడును. పాతాళములో రెండు భాగములున్నాయి. 1) రక్షింపబడినవారికి విశ్రాంతినిచ్చే ప్రదేశము 2) నశించినవారు బాధనొందే ప్రదేశము. నీతిమంతుల ఆత్మలు సౌకర్య వంతమైన ప్రదేశములో పాతాళము నందు వుందురు. బీదవాడైన లాజరు చనిపోయినప్పుడు ''అబ్రాహాము రొమ్మునకు దూతలచే కొనిపోబడెనని"

యేసు చెప్పెను (లూకా 16:22). అతడు అబ్రాహాముతో సన్నిహిత సంబంధము గల ప్రదేశమునకు కొనిపోబడెను.

## పరదైసు

మరల లూకా 23:43, యేసుతో సిలువ వేయబడిన ఇద్దరు దొంగలను గూర్చి చెప్పుచున్నది. వారిలో ఒకడు మారుమనస్సు పొందగా "నేడు నీవు నాతో కూడ పరదైసులో యుందువు" అని యేసు అతనితో చెప్పెను (లూకా 23:43; అపొ.కా. 2:27,31 కూడ చూడుము). పరదైసు అను మాటకు "రాజవనము" లేక తోట యని అర్థము. మరణమైన తరువాత నీతిమంతుల ఆత్మలు ఆహ్లాదకర మైన స్థలములో యుండునని ఈ వచనముల వలన మనకు అర్థమగుచున్నది.

## వేదనపడు స్థలము

పాపాత్ములైన వారి ఆత్మలు పాతాళములోనే వేదనపడు స్థలమునకు కొనిపోబడును. దరిద్రుడైన లాజరు సందర్భములో "ధనవంతుడు కూడ చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళములో బాధపడుచు, కన్నులెత్తి దూరము నుండి అబ్రాహామును అతని రొమ్మున ఆనుకొనియున్న లాజరును చూచెను'' (లూకా 16:22-31). తరువాత "నేను ఈ అగ్నిజ్వాలలలో యాతనపడుచున్నానని కేకలు వేసి చెప్పెను" (లూకా 16:24). ఆవేదన కరమైన ప్రదేశము నుండి ఆ ధనవంతుడు అబ్రాహాము దగ్గరకు వెళ్ల వీలు లేకుండెను (లూకా 16:26). మరియు అప్పటి కింకను భూమి మీద సజీవులైయున్న తన అయిదుగురు సహోదరులకు ఎవ్విధమైన వర్తమానము పంప వీలు లేకుండెను (16:27-31).

## పునరుత్థానము

ప్రజలందరు మరణము నుండి లేపబడితే క్రీస్తు యేసు చేత తీర్పు నొందుదురు. "దీనికి ఆశ్చర్యపడకుడి, ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరని" యేసు చెప్పెను (యోహాను 5:28-29). "ఆయన నియమించిన మనుష్యుని చేత నీతిననుసరించి భూ లోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించియున్నాడు" (అపొ. కా. 17:31; మత్తయి 25:31-33; ప్రక 20:11-15).

"ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందునట్లు మన మందరము క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10).

## అంతిమ తీర్పు

యేసు క్రీస్తు తీర్పు తీర్చునప్పుడు

రక్షింపబడినవారిని చూచి, "నా తండ్రి చేత ఆశీర్వదించబడిన వారలారా, రండి లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి'' యని చెప్పును (మత్తయి 25:34). ఆ దినమందు రక్షింపబడిన రాజ్య పౌరులందరు నిత్య నివాసము లోనికి ప్రవేశింతురు (కొలస్స 1:13; ఫిలిప్పీ 3:20; అపొ.కా. 14:21-22; 2 పేతురు 1:10-11; I కొరింథీ 15:24; ప్రక 21:1-4).

దుర్మార్గులతో ఆయన "శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదినికి వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" యని చెప్పును (మత్తయి 5:41). "వీరు నిత్య శిక్షకును నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు'' (మత్తయి 25:46). ఆ భవిషత్కాలమును గూర్చి చెప్పుచు యోహాను, "మరణమును, మృతుల లోకమును అగ్నిగుండములో పడవేయ బడెను. ఈ అగ్నిగుండము రెండవ మరణము. ఎవని పేరైనను జీవ గ్రంథ మందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయ బడును'' అని చెప్పెను (ప్రక 20: 14-15).

## భయపడవలదు

మనము క్రీస్తు సువార్తకు లోబడి నమ్మకముగా యుండిన యెడల మరణమును గూర్చియు, నిత్యాగ్నిని గూర్చియు భయపడనక్కరలేదు. మనము బాప్తిస్మము నొందినప్పుడు దేవుని కృప వలన యేసు రక్తము మన పాపములను నిర్మూలించును. ఆయనతో నడుచుచు యుండగా ఆయన రక్తము మనలను శుద్ధి చేయుచుయుండును (అపొ.కా. 2:38; 22:16; రోమా 6:3-4; 23:8:1; ఎఫెసీ 1:7; 2:8-9; హెబ్రీ 3:12-14; I యోహాను 1:7). "కాబట్టి చిన్న పిల్లలారా, ఆయన ప్రత్యక్షమగు నప్పుడు ఆయన రాకడయందు మనము సిగ్గుపడక, ధైర్యముగా యుండునట్లు మీరాయన యందు నిలిచియుండుడి" (I యోహాను 2:28).

ఆయనను ప్రేమించువారందరికీ తీర్పు దినము ఒక సంతోష దినము! యేసు ఇట్లు చెప్పారు : "మీ హృదయము లను కలవరపడనియ్యకుడి! దేవుని యందు విశ్వాసముంచుచున్నారు; నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు; లేని యెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను; నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును'' (యోహాను 14:1-3).

**- రోయస్ ఫ్రెడరిక్**

# దేవుని పరిశుద్ధత

## (The Holiness of God)

***- Allen Webster***

పరిశుద్ధత దేవుని లక్షణమైయున్నది. అన్నిటికంటె ముఖ్యముగా ఆయన పరిశుద్ధుడని పాత నిబంధనలో వక్కాణించబడినది. రాజైన ఉజ్జియా మృతినొందిన సంవత్సరములో "అత్యున్నత సింహాసనమందు ప్రభువు ఆసీనుడైయుండగా" యెషయా చూచెను (యెషయా 6:1). దేవుని సింహాసనము చుట్టూయున్న సెరాపులు గొప్ప గాన ప్రతిగానములతో "సైన్యములకు అధిపతియగు యెహోవా, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు" యని ఆయనను కీర్తించుచుండిరి (యెషయా 6:3). "సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది" (యెషయా 6:3; ప్రక 4:8-11).

### దేవుని పరిశుద్ధత మనోహరమైనది

అన్యజనుల దేవుళ్లు, దేవతలు అసహ్యమైనవి, అందవికారమైనవి. పరమందలి నిజదేవుడు సౌందర్యుడు. దేవుడు ఎంత అందముగా యుంటారో నీవు ఎన్నడైనా ఆలోచించావా? దావీదు ఇట్లు చెప్పాడు "యెహోవా యొద్ద ఒక్క వరము అడిగితిని, దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను" (కీర్తన 27:4). ఆయన సౌందర్యము పరిపూర్ణమైనది. "సంపూర్ణ సౌందర్యముగల సీయోనులో నుండి దేవుడు ప్రకాశించుచున్నాడు" (కీర్తన 50:2). హెబ్రీయుల కీర్తనల గ్రంథములో మోషే వ్రాసిన ఏకైక కీర్తనను ఇట్లు ముగించాడు "మా దేవుడైన యెహోవా ప్రసన్నత మా మీద నుండును గాక. మా చేతి పనిని మాకు స్థిరపరచుము. మా చేతి పనిని స్థిరపరచుము" (కీర్తన 90:17).

దేవుని సౌందర్యవంతునిగా చేయునదేమిటి? పరిశుద్ధత! యూదా రాజైన యెహోషాపాతు "యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందర నడుచుచు యెహోవా కృప నిరంతరముండును ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని నియమించెను" (2 దినవృ 20:20-21; I దినవృ 16:29; కీర్త 29:2; 96:9).

నాలుగు వందల సంవత్సరములకు పైగా ఐగుప్తు బానిసత్వములో నుండి ఇశ్రాయేలీయులు యెహోవా దేవుని వలన విడుదల పొందిన తరువాత మోషే దేవుని పరిపూర్ణ సౌందర్యమును గూర్చి ఇట్లు పాడెను : "యెహోవా, వేల్పులలో నీవంటి వాడెవడు? పరిశుద్ధతను బట్టి నీవు

మహనీయుడవు. స్తుతి కీర్తనలను బట్టి పూజ్యుడవు. అద్భుతములు చేయు వాడవు. నీ వంటి వాడెవడు?" (నిర్గమ 15:11). నీ వంటి వాడెవడు? అనగానే ఎవరును లేరను జవాబు అందులోయున్నది. "యెహోవా నిన్ను పోలిన వాడెవడును లేడు, నీవు మహాత్మ్యము గల వాడవు. నీ శౌర్యమును బట్టి నీ నామము ఘనమైన దాయెను అని యిర్మియా వ్రాసాడు (యిర్మియా 10:6).

ఆ సౌందర్యమును ఒకానొక దినమందు మనము స్వతంత్రించుకొందు మని క్రొత్త నిబంధన ఆశ్చర్యరీతిగా బయలుపరచుచున్నది. భక్తుడైన యోహాను ఇట్లు వ్రాసాడు: "ప్రియులారా ఇప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్ష పరచబడలేదు గాని ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలియుం దుమని యెరుగుదుము" (I యోహాను 3:2).

మనం దేవుని తెలిసికొనినప్పుడు సహజంగా ఆయననుబట్టి ఆయనను స్తుతించుదుము. దేవుని చూచి ఆశ్చర్య పడుట సహజము. యెహోవాను ఎరిగిన వారు ఇందలి విషయమై ఏకీభవింతురు. "యెహోవా మహా ఘనత వహించిన వాడు. ఆయన బహుగా స్తుతినొందదగిన వాడు. సమస్త దేవతల కంటే ఆయన పూజ్యుడు" (I దినవృ 16:25). "కీర్తనీయుడైన యెహోవాకు నేను మొఱ్ఱపెట్టితిని, నా శత్రువుల చేతిలో నుండి ఆయన నన్ను రక్షించెను" యని దావీదు చెప్పిన మాటలు సాధారణముగా యువకుల కిష్ట పూర్వకమైనవి. యెహోవా ప్రసన్నత నెరిగినవాడు ఆయనను కీర్తించకుండా యుండలేడు (కీర్తన 9:11; 33:2; 67:3; హెబ్రీ 13:15).

## దేవుని పరిశుద్ధత ప్రత్యేకమైనది

"యెహోవా వంటి పరిశుద్ధ దేవుడు ఒకడును లేడు, నీవు తప్ప మరి ఏ దేవుడును లేడు. మన దేవుని వంటి ఆశ్రయ దుర్గమేదియు లేదు" అని హన్నా దేవుని స్తుతించెను (I సమూ 2:2). "యెషూరూనూ, దేవుని పోలిన వాడెవడును లేడు. ఆయన నీకు సహాయము చేయుటకు ఆకాశవాహనుడై వచ్చును. మహోన్నతుడై మేఘవాహనుడగును" (ద్వితీ 33:6; కీర్తన 86:8; యెషయా 40:18, 25; 43:11-13). దేవుడొక్కరు మాత్రమే పరిపూర్ణ పరిశుద్ధుడు, ఆయన పరిశుద్ధ పరచ బడినవాడని బైబిలు దేవుని గూర్చి ఎన్నడు పలుకదు. గతంలో దేవుడు ఎప్పుడో పరిశుద్ధతను సంపాదించుకొనలేదు. దానిని ఆయన పోగొట్టుకొనేది కాదు. ఆయనే పరిశుద్ధుడు! కీడును బట్టి ఆయన శోధింపబడనేరడు (యాకోబు 1:13). నిజానికి ఆయన శోధించడు, శోధించబడడు.

## దేవుని పరిశుద్ధత అచంచలమైనది

"ఆయన వెలుగైయున్నాడు; ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు" అని యోహాను వ్రాసాడు (I యోహాను 1:5). దేవుడు పరిశుద్ధుడు. పరిపూర్ణుడు. కీడును బట్టి ఆయన పాడు చేయబడడు. దుష్టత్వము యొక్క ఛాయ నుండి ఆయన

వేరైనవాడు. దేవుని యొక్క తత్వములో స్వవిరుద్ధమైనదేదీ లేదు. ఏది సత్యమో దేవుడెరిగి అసత్యాన్ని జరిగింపడు. ఆయన క్రియలు ఎల్లప్పుడు నీతియే. ఆయన మాటలు ఎన్నడు సత్యమే (తీతు 1:1-2). పరిశుద్ధ లక్షణములను మానవుడు కలిగియుండగలడు. గాని దేవుడైతే స్వతహాగా పరిశుద్ధుడే. ఆయన నిత్యము పరిశుద్ధుడే. మనమైతే అట్లుకాదు. అప్పుడప్పుడు పరిశుద్ధత కొంత కనబరుస్తాము. ఆయన అంతరంగికముగా పరిశుద్ధుడు. ఆయనను బట్టి మనం పరిశుద్ధులము. మన పరిశుద్ధత క్షీణించును. దిగజారును. గాని దేవుని పరిశుద్ధత మార్పు లేనిది. క్షీణించనిది. కప్పిపుచ్చలేనిది (యాకోబు 1:17).

## దేవుని పరిశుద్ధత తీవ్రమైనది

దేవుని పరిశుద్ధత అచంచలమైనది. గనుక ఆయన కీడును ఎన్నడు అనుమతించరు. "నీవు దుష్టత్వము చూచి ఆనందించు దేవుడవు కావు. చెడుతనమునకు నీయొద్ద చోటు లేదు" అని దావీదు వ్రాసాడు (కీర్తన 5:4). "నీ కను దృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది గదా; బాధించువారు చేయు బాధను నీవు దృష్టింపజాలవు కదా" యని ప్రవక్తయగు హబక్కూకు వ్రాసాడు (హబక్కూకు 1:13). దేవుడు ఎట్లు పాపము చేయలేరో అట్లే పాపమును ఆయన అనుమతించరు (సంఖ్యా 23:19). దేవుడు దుష్టత్వానికి అనుమతినియ్యరు, దానిని ఆయన జరిగించరు (సంఖ్యా 23:19). దుష్టత్వాన్ని ఆయన అంగీకరిస్తే దానిలో ఆయన పాలు పొందినట్లేయగును (I తిమోతి 5:22).

దేవుడు నిశితముగా పరిశుద్ధుడు గనుక, పాపమును ఆయన తీవ్రముగా ద్వేషిస్తారు (ఆమోసు 5:21-33; యెషయా 1:14). దేవుని పరిశుద్ధత సార్వజనికం. అనంతం. అందరిలోను, అన్ని కాలములలోను, దేవుడు పాపమును ద్వేషిస్తారు (కీర్తన 57:5; 7-11). దావీదు దేవునికి ఇష్టుడైయుండెను (అపొ.కా. 13:22). గాని దేవుడతని పాపమును సహించలేక పోయెను (2సమూ 11-12 అధ్యా). మోషే దేవుని ప్రజలను బానిసత్వము నుండి విడిపించాడు. గాని ఒక్క విషయములో అవిశ్వాసమును కనుబరచినందున కానాను చేరలేకపోయాడు (సంఖ్యా 20:8-12). దేవుడు తన్ను తానే నిరాకరించుకోలేరు (2తిమో 2:13).

పరిశుద్ధులే దేవుని సన్నిధికి చేరుకోగలరు. అందరు పాపము చేసినందువలన (రోమా 3:23; I యోహాను 1:8-10). అందరు అపరిశుద్ధులైనందువలన మానవుడు ఎట్లు దేవుని చేరుకోగలడు? అతడు ఆరాధన ద్వారా దేవుని చేరుకొనక ముందు పరిశుద్ధుడని (పాప క్షమాపణ పొందినవాడని) ప్రకటింపబడాలి. కొరింధీయులు పాపులుగాని యేసు క్రీస్తునామము ద్వారాను, దేవుని ఆత్మ వలనను పరిశుద్ధులుగా చేయబడిరి (I కొరింధీ 6:9-11). మానవుడు యేసుక్రీస్తు ద్వారా మాత్రమే దేవునితో సమాధానపడగలడు (2 కొరింధీ 5:18).

**- ఎలెన్ వెబ్‌స్టర్**



# The God Who Became a Baby

Maker of the Sun,
He is made under the sun.
In the father he remains,
from the mother he goes forth.
Creator of heaven and earth,
He was born on earth under heaven.
Unspeakably wise,
He is wisely speechless.
Filling the world,
He lies in a manger.
Ruler of the stars,
He nurses at his mother's bosom.
He is both great in the nature of God,
And small in the form of a servant.

*- Augustine Hippo, The Book of Jesus*

# GOSPEL PREACHING ON TELEVISION & RADIO

Telugu : Sunday 6.00 p.m. Shubhavarta Channel
Tuesday 3.0 p.m. &
Wednesday 7.30 a.m. Nireekshana Channel
Saturday 6.30 a.m. Araadhana Channel
Everyday 7:30 a.m. & 3:30 p.m. Kanthi Channel
YouTube & Facebook : 24 hrs. daily
click on: Satyavani Church of Christ
Speakers : Ricky, Ronnie & Joshua Gootam

Hindi : Shubhasandesh Channel Sunday & Tuesday 7.00-7.30 pm
Every Friday night 8:00 to 8:30 p.m.
Speakers : Francis, Vinay, & Sunny David
P.O. Box. 3815, New Delhi - 110049

Malayalam: Jai Hind Channel Saturday 6.00-6.30 a.m
Speaker : P.K. Varghese

Tamil : Tamilan T.V. Tuesday 9.30 - 9.45 p.m
Sunday 6.45 - 7.00 p.m.
Holy Cross T.V. Sunday 6.30-6.45 a.m (Only in Puducherry)
King of Glory T.V. Sunday 6.15 - 6.30 a.m (in Tirunelveli Dist)
Speakers : Philemon & Kingsley

Tamilan T.V. Monday 7.00 - 7.15 a.m
Thursday 9.30 - 10 p.m.
Saturday 7.15 - 7.30 a.m.
Speaker : Rajanayagam

Tamilan T.V. Monday 6.00 - 6.15 a.m.
Saturday 6.15 - 6.30 p.m.
Speaker : Arjunan

**TAMIL RADIO PROGRAMS FROM SRI LANKA RADIO**
Sunday to Wednesday 5.30 - 5.45 p.m.
Speakers : Douglas & P.R. Swamy
Saturday 5.30 - 5.45 p.m., speakers : Arjunan

Please write to these addresses for
Bible correspondence courses, Magzines,
and other Christian Literature in your language.

All of these Programmes are sponsored
by
**CHURCH OF CHRIST**